మంగళవారం
19-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 177
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

వారణాసిలో అతిపెద్ద ధ్యాన కేంద్రం

వారణాసి: ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వారణాసిలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యానకేంద్రమైన స్వర్‌వేద్ మహామందిరాన్ని ప్రారంభించారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఒకేసారి 20వేల మంది ధ్యానం చేసుకునేందుకు వీలుగా దీనిని నిర్మించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'ఇక్కడ గడిపే ప్రతిక్షణం అద్భుతంగా ఉంటుంది. కాశీ నాకెప్పుడూ సొంతింటికొచ్చిన అనుభూతినిస్తుంది. సాధువుల మార్గదర్శకత్వంలో జరిగిన నూతన నిర్మాణాలు, అభివృద్ధి విషయంలో కాశీ ప్రజలు సరికొత్త రికార్డులు సృష్టించారు. అందుకు ఈ మహామందిరం ఓ నిదర్శనం' అన్నారు.

పేదల సంజీవని ఆరోగ్యశ్రీ

- దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం
- పథకం పరిమితి పెంపును ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదవాడికి ఆరోగ్యశ్రీ ఒక వరమని, వారి జీవితానికి ఆ పథకం సంజీవనిలా ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ పథక పరిమితిని రూ. 25 లక్షలకు పెంచే కార్యక్రమాన్ని సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రాంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదవాడికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైద్య ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ కిందకు వస్తుందని, పథకం కింద వర్తించే చికిత్సల సంఖ్య పెంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,513 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఏ పేదవాడు వైద్యం కోసం అప్పులు కాకూడదని అడుగులు వేస్తున్నామని సీఎం చెప్పారు. ఏపీలో కొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ జరుగుతుందని, క్యూఆర్ కోడ్‌తో కార్డులో లబ్ధిదారుని ఫొటో, ఆరోగ్య వివరాలు ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రతీ ఒక్కరికీ విస్తరించాలన్నదే తమ లక్ష్యమని, రాష్ట్రంలోని 1.4 కోట్ల మందిని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చామన్నారు. కొత్తగా మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని, పార్లమెంట్ స్థానానికి ఒక మెడికల్ కాలేజీ ఉండేలా ప్రణాళిక రూపొందించామని వివరించారు. ప్రతీ ఇంట్లో దిశ, ఆరోగ్యశ్రీ యాప్‌లు ఉండాలని, ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల్లో రోగికి సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా రోగి వివరాలు అన్నీ డాక్టర్లకు తెలుస్తాయని, ఆరోగ్య శ్రీ సేవల గురించి తెలియని వ్యక్తి ఎవరూ ఉండకూడదన్నారు. ఇప్పటికే డోర్ డెలివరీకి సంబంధించి ట్రయల్ రన్ ప్రారంభించామని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స పొందిన వారికి మందులు ఉచితంగా ఇంటి వద్దే అందజేస్తామని సీఎం తెలిపారు. కాన్సర్ లాంటి వ్యాధులకు సైతం ఆరోగ్యశ్రీ వర్తింపజేశామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ.4,100 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం ఏటా రూ.1000 కోట్లు కూడా ఖర్చు చేసేది కాదని విమర్శించారు. జాతీయస్థాయిలో స్పెషలిస్ట్ దాక్టర్ల కొరత 61 శాతం ఉంటే.. రాష్ట్రంలో 3.3 శాతం మాత్రమే ఉందని, ఈ ఖాళీలు కూడా లేకుండా చూసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. రోగి చికిత్స తర్వాత విశ్రాంతి తీసుకునేవారికి నెలకు రూ.5వేల చొప్పున ఆరోగ్య ఆసరా ఇచ్చామని గుర్తుచేశారు. ఆరోగ్య ఆసరా కింద 25,27,870 మందికి రూ.1,310 కోట్లు చెల్లించామని చెప్పారు. ఇక వైద్యరంగంలో ఎన్నడూలేని విధంగా 53,126

- మిగతా 2 లో

78 మంది ఎంపీల సస్పెన్షన్

- భద్రతా వైఫల్యంపై ప్రశ్నించడమే కారణం
- బీజేపీ ప్రభుత్వంపై విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ: విపక్షాలపై నరేంద్రమోదీ కక్షసాధింపు తీవ్రతరమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేసింది. సోమవారం ఒక్క రోజు 78 మందిని సస్పెండ్ చేసింది. ప్రశ్నించడాన్ని సహించలేని మోదీ ప్రభుత్వం ఏకంగా చట్టసభల నుంచి ఎంపీలను బయటికి పంపుతోంది. ఒకటి, రెండు రోజులు కాకుండా ఏకంగా శీతాకాల సమావేశాల మొత్తం సభ్యులను సస్పెండ్ చేసింది. పార్లమెంట్‌లో గతవారం చోటుచేసుకున్న భద్రతా వైఫల్యం ఘటనపై ఉభయసభల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. విపక్షాల నిరసనలతో సోమవారం కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో కార్యకలాపాలు స్తంభించాయి. మరోవైపు, సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారన్న సాకుతో ఒక్క రోజే 78 మందికి పైగా విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. లోక్‌సభలో 33 మంది, రాజ్యసభలో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి సహా 33 మందిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. వీరిలో 30 మందిని ఈ శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయగా... మరో ముగ్గురిని ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. ఎంపీలు కె.జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీఖ్ స్పీకర్ పోడియం వద్ద నినాదాలు చేశారు. వీరి ప్రవర్తనపై ప్రివిలేజెస్ కమిటీ నివేదిక ఇవ్వనుంది. మరోవైపు శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్‌కు గురైన వారిలో కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరీ, ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగొయ్, డీఎంకే ఎంపీలు ఎ.రాజా, టీఆర్ బాలు, దయానిధి మారన్, టీఎంసీ ఎంపీలు సౌగతారాయ్, కల్యాణ్ బెనర్జీ, కకోలి ఘోష్, శతాబ్ది రాయ్ తదితరులు ఉన్నారు. సభాపతి ఆదేశాలు ధిక్కరించారన్న ఆరోపణతో సభ్యుల సస్పెన్షన్ కోసం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా లోక్‌సభలో ఇప్పటికే 13 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్

- మిగతా 2 లో

మోదీ, అమిత్‌షా నోరు విప్పాల్సిందే

- పార్లమెంటుకు భద్రతా వైఫల్యం తీవ్రమైనది
- మోదీ సర్కారును గద్దె దించడం కోసం 'ఇండియా' బలోపేతం
- వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యత అవశ్యం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

భువనేశ్వర్: బీజేపీ పాలనను దేశం తరిమికొట్టేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి కృతనిశ్చయంతో పనిచేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ సర్కారును ఇంటికి పంపిస్తామని ధీమాగా చెప్పారు. పార్లమెంటుకు భద్రతా వైఫల్యంపై ప్రధాని నరేంద్రమోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేసి తీరాల్సిందేనని రాజా డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన రాజా...విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభలోకి దుండగులు చొచ్చుకు రావడాన్ని అత్యంత తీవ్రమైన భద్రతా వైఫల్యంగా రాజా అభివర్ణించారు. 'పార్లమెంటు వేదికగా ప్రధాని లేదా కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాల్సిందే. భద్రతా వైఫల్యం తీవ్రతను దేశానికి వివరించాలి. మోదీ, అమిత్ షా సభ

- మిగతా 2 లో

మోదీ సర్కారు బరి తెగింపు

- జిందాల్ స్టీల్‌తో చీకటి ఒప్పందం
- విశాఖ ఉక్కు నిర్వీర్యానికి కుట్రలు
- సీఎం జగన్ ఎందుకు మాట్లాడరు?
- కార్మిక సంఘాల ఆగ్రహం
- రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కును తుక్కు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్న కేంద్రంలోని మోదీ సర్కారు అందుకనుగుణంగా రహస్యంగా అడుగులేస్తోంది. జిందాల్ స్టీల్‌తో చీకటి ఒప్పందం ఇందులో ఒకటి. దీనిపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ ఉక్కు యాజమాన్యం-జిందాల్ స్టీల్ మధ్య జరిగిన చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని, విశాఖ ఉక్కును పూర్తి స్థాయి సామర్థ్యంతో ప్రభుత్వ రంగంలో నడిపే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. విశాఖ ఉక్కును వ్యూహాత్మక విక్రయం పేరుతో 100శాతం అమ్మకానికి పెట్టిన మోదీ సర్కారు... ప్లాంటును, కార్మికులను సంక్షోభంలోకి నెడుతోంది. ఏడాదికి 2లక్షల టన్నుల ఉత్పత్తి చేసే బ్లాస్ట్ ఫర్నేస్-3ని గత రెండు సంవత్సరాలుగా మూసి వేసింది. జిందాల్ స్టీల్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోవాలని విశాఖ స్టీల్ ప్లాంట్ కమిటీ ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయించినట్లు సమాచారం. సంవత్సరానికి కోటిటన్నుల ఇనుప ఖనిజం ప్లాంటుకు అవసరం అయినప్పటికీ, ఈ సంవత్సరం కిరండోల్ బచేరీ బైలదిల్లా గనుల నుండి 40లక్షల టన్నుల మాత్రమే సరఫరా చేశారు. ఈ గనులను ప్రైవేటు వారికి ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌కు బళ్లారి కుమారస్వామి, దోనమల్కె గనుల నుండి ఖనిజం తెచ్చుకోమని కేంద్రం చెబుతోంది. దీని వలన రవాణా ఖర్చు, ఉత్పత్తి ఖర్చు పెరిగి ప్లాంటు నష్టాల్లోకి పోతోంది. బ్లాస్ట్‌ఫర్నేస్‌ను నడపాలనే పేరుతో జిందాల్ కు కట్టబెట్టే ప్రయత్నాలు కేంద్రం మొదలెట్టింది. ఈ దిశగా జిందాల్ స్టీల్‌తో రహస్య మంతనాలు జరుపుతోంది. ప్లాంటును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర కొనసాగిస్తోంది. ఎందుకు బైలదిల్లా గనుల నుండి ఖనిజం ఇవ్వరని, జిందాల్‌ను ఎందుకు రంగంలో దించుతున్నారని ఉక్కు కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వివరాలు వెంటనే బహిర్గతం చేయాలని స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇన్ని కష్టాల్లోను ఈ సంవత్సరం గత 9నెలల్లో (ఏప్రిల్ నుండి డిసెంబరు వరకు) విశాఖ స్టీల్ ప్లాంటు రూ.19వేల కోట్లు టర్నోవర్ సాధించింది. కానీ 4500మంది ఎగ్జిక్యూటివ్స్‌కి ఈ నెల 50 శాతం మాత్రమే జీతాలు చెల్లించారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌కు జీతాలు ఇవ్వడమే కష్టమని బెదిరిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు. రూ. 19000 కోట్ల టర్నోవర్‌కు గాను ప్లాంటు

- మిగతా 2 లో

భూములు బదలాయించం

కేంద్ర మంత్రి ఫగన్ సింగ్ కులస్తే స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సేకరించిన భూములను ఆ కర్మాగారానికి బదిలీ చేసే ప్రతిపాదన ఏదీ లేదని ఉక్కు శాఖమంత్రి ఫగన్ సింగ్ కులస్తే స్పష్టం చేశారు. రాజ్యసభలో సోమవారం వైసీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూములను ఆ ప్లాంట్‌కు బదలాయించడం ద్వారా దాని ఆస్తుల విలువను, రుణ శక్తిని పెంపొందించడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అందుకు నిరాకరించడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వం భూములు సేకరించి అప్పగించింది. తదనంతరం ఆ భూములపై సర్వహక్కులు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు బదలాయించారు. స్టీల్ ప్రాజెక్ట్ కోసం ఆ భూములు వినియోగించుకోవడానికి వీలుగా ఉక్కు మంత్రిత్వ శాఖ ఆర్ఐఎన్ఎల్‌కు పవర్ ఆఫ్ అటార్నీ జారీ చేసింది. అందువలన ఆ భూములపై యాజమాన్య హక్కులను ఆర్ఐఎన్ఎల్‌కు బదిలీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని మంత్రి సమాధానమిచ్చారు. అలాగే రూర్కేలా స్టీల్‌ప్లాంట్ మినహా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) దేశంలోని వివిధ ప్రాంతాలలో నెలకొల్పిన స్టీల్ ప్లాంట్ల భూములపై సర్వహక్కులు ఆయా ప్లాంట్ల పేరిట దఖలు పడి ఉన్నట్లు ఉక్కుశాఖ మంత్రి వెల్లడించారు. భిలాయ్, బోకారో, దుర్గాపూర్,

- మిగతా 2 లో

రైతులను ఆదుకోవడంలో పాలకులు విఫలం

- హైకోర్టు ఏర్పాటు తర్వాతే సీమ ప్రజల ఓట్లు అడగాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కరువు, తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా 10వ మహాసభ సందర్భంగా సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు భారీ ప్రదర్శన చేపట్టారు. సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభకు రైతు సంఘం నాయకులు పంపన్న గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు పెడతామని మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరాం రాయలసీమ గర్జన సభలో చెప్పారని, అయితే నాలుగున్నర సంవత్సరాలు పూర్తయినా నేటికీ హైకోర్టు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వానికి ఒక్క లేఖ కూడా రాయలేదని తెలిపారు. ఇది రాయల సీమ ముఖ్యంగా కర్నూలు ప్రజలను, యువతను వంచించడమేనని విమర్శించారు. రాయలసీమకు హైకోర్టు తీసుకువచ్చిన తరువాతనే రాయలసీమ ప్రజలను వైసీపీ నాయకులు ఓట్లు అడగాలన్నారు. ప్రజల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలపై వ్యతిరేకత ఉందని, కొత్తవారికి ఇస్తేనే విజయం సాధిస్తామని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

దిగ్విజయం యువగళం

- 226 రోజులు-3,132 కి.మీ
- ప్రభుత్వ నిర్బంధాలు అధిగమిస్తూ పాదయాత్ర
- కుప్పంలో ప్రారంభించి ఆగనంపూడిలో ముగించిన లోకేశ్
- గతంలో చంద్రబాబు పాదయాత్ర కూడా ఇక్కడే ముగింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభుత్వ నిర్బంధాల మధ్య విజయవంతంగా ముగిసింది. చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ ఏడాది జనవరి 27న లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి

- మిగతా 2 లో

కోవిడ్ అప్రమత్తత

- అనేక రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు
- తాజాగా సూచనలు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కలకలం మళ్లీ మొదలైంది. క్రమంగా కోవిడ్ కేసులు పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. అనేక రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు పెరగడం, కేరళలో కొత్త సబ్ వేరియంట్ వెలుగు చూసిన దృష్ట్యా కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలు మరోసారి తీసుకోవాలని అన్ని రాష్ట్రాలను హెచ్చరిస్తూ తాజా సలహాలు జారీ చేసింది. రానున్న పండగల సీజన్‌లో వైరస్ కట్టడి చర్యలను ముమ్మరంగా చేపట్టాలని సూచించింది. ఇన్‌ఫ్లుయెంజా తరహా కేసులను జిల్లా స్థాయిలోనే నమోదు చేసి వాటిపై పర్యవేక్షణ ఉంచాలని తెలిపింది. కరోనా వైరస్ కొత్త సబ్ వేరియంట్ జేఎన్1 కేసులు ఇటీవల కేరళలో వెలుగుచూసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్ర ఆరోగ్య శాఖ భారత్ సహా 38 దేశాల్లో ఈ కొత్త వేరియంట్‌ను గుర్తించినట్లు వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రాలను

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌కు ఈడీ మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్‌కు సంబంధించి ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఈ నెల 21న (గురువారం) విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఇదే వ్యవహారంలో తొలుత కేజ్రీవాల్‌కు నవంబర్ 2న విచారణకు హాజరవ్వాలని సమన్లు జారీ చేసినప్పటికీ... మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కారణంగా తీరికలేనందున ఆయన హాజరు కాలేదు. అదే సమయంలో ఈడీ తీరుపై మండిపడిన కేజ్రీవాల్... 'ఆ సమన్లు

- మిగతా 2 లో

కరాచీ ఆస్పత్రిలో దావూద్ ఇబ్రహీం



కరాచీ: పరారీలో ఉన్న ముంబై పేలుళ్ల సూత్రధారి, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం తీవ్ర అనారోగ్యంతో పాకిస్థాన్‌లోని కరాచీలో గల ఓ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. అతడిపై విషప్రయోగం జరిగినట్లు సమాచారం. దావూద్‌కు భారీ భద్రత మధ్య ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే దావూద్ రెండు రోజుల క్రితమే ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆ ఆస్పత్రి ఫ్లోర్‌లో అందరిని ఖాళీ చేయించి దావూద్‌కు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. వైద్యులు, అతడి కుటుంబ సభ్యులను మాత్రమే ఆస్పత్రిలోకి అనుమతిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముంబై పోలీసులు దావూద్ బంధువుల దగ్గరి నుంచి మరింత సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నట్లు వినికిడి.

ఇంటర్నెట్ సేవలు బంద్

మరోవైపు, పాకిస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచే ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగినట్లు సమాచారం. యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వెబ్‌సైట్లు కూడా డౌన్ అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కరాచీ, లాహోర్, రావల్పిండి వంటి ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినట్లు పాక్‌లోని మీడియా సంస్థల కథనాలు వెల్లడించాయి. దావూద్ ఇబ్రహీం రెండో పెళ్లి చేసుకుని కరాచీలో నివసిస్తున్నట్లు అతడి బంధువులు తెలిపినట్లు ఈ ఏడాది జనవరిలో వార్తలు వచ్చాయి. అతడి మేనల్లుడు అలీషా పార్కర్ దావూద్ కుటుంబం గురించి పూర్తి వివరాలు వెల్లడించినట్లు సమాచారం. దీంతో కరాచీలోనే వేరే ప్రదేశానికి మారినట్లు తెలుస్తోంది. 1993లో ముంబైలో జరిగిన దాడులకు దావూద్ ఇబ్రహీం సూత్రధారి. ఈ దాడుల్లో 250 మందికి పైగా మృతి చెందారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. దీంతో దావూద్‌ను భారత్ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలో చేర్చారు. ఇతడి గురించి జాతీయ దర్యాప్తు సంస్థ- ఎన్ఐఏ ముమ్మరంగా దర్యాప్తు చేస్తోంది. ఇతడు పాకిస్థాన్‌లోని కరాచీలో ఉంటున్నాడని భారత్ అనేకమార్లు చెప్పినా వాటిని పాకిస్థాన్ వ్యతిరేకించింది. అయితే ఇప్పటికే దావుద్‌ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 2018లో ఐరాస విడుదల చేసిన అంతర్జాతీయ ఉగ్ర సంస్థలు, ఉగ్రవాదుల జాబితాలో దావూద్ పేరు కరాచీ చిరునామాతో ఉంది.

ఇటాలియన్ తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ కన్నుమూత

ప్యారిస్: ప్రముఖ ఇటాలియన్ తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ (90) కన్నుమూశారు. శనివారం ప్యారిస్‌లోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆయన భార్య, తత్వవేత్త జుడిత్ రెవెల్ సోమవారం ప్రకటించారు. నెగ్రీ సైద్ధాంతిక రచనలతో పాటు కార్మిక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనేవారు. కార్మికుల కోసం ప్రత్యేక (వర్కర్స్ పవర్) సంస్థను స్థాపించారు. నెగ్రీ రచించిన పుస్తకం ఎంపైర్ అనేక విమర్శలను ఎదుర్కొంది. నెగ్రీ ఆగష్టు 1, 1933న ఇటలీలోని పదువాలో జన్మించాడు. ఆయన పదువా, ప్యారిస్ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. నెగ్రీ 1956లో ఇటాలియన్ సోషలిస్ట్ పార్టీలో సభ్యుడయ్యాడు. 1969లో 'పొట్టెరే ఒపెరాయో' అనే రాజకీయ పార్టీలో చేరారు. 1973లో స్థాపించిన ఈ సంస్థ అనంతరం రద్దు చేయబడింది. తీవ్రవాద సంస్థ రెడ్ బ్రిగేడ్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై నెగ్రీ అరెస్టయ్యారు. 1978లో క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు ఆల్డో మోరోను కిడ్నాప్ చేసి హత్య చేయడంతో సహా అనేక ఆరోపణలపై 13 సంవత్సరాలకు పైగా ఆయన జైలు శిక్ష అనుభవించారు.

క్వీన్స్‌లాండ్‌ను ముంచెత్తిన వరదలు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలో పెద్ద ఎత్తున వరదలు సంభవించాయి. జాస్పర్ తుపాను కారణంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 1977లో నమోదైన భారీ వరదల రికార్డును ఇవి దాటేసి ఉంటాయని క్వీన్స్‌లాండ్ ప్రీమియర్ జాన్ మైల్స్ పేర్కొన్నారు. 24 గంటల వ్యవధిలో బ్లాక్ మౌంటైన్‌లో 625 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు అక్కడి వాతావరణ శాఖ వెల్లడించింది. మరికొన్ని ప్రాంతాల్లో 300 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసినట్లు తెలిపింది. తుపాను మొదలైన నాటి నుంచి 20 చోట్ల మీటరుకు పైగా వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. డెయిన్‌ట్రీ నదీ పరీవాహక ప్రాంతంలో మొత్తం 820మి.మీల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల 500మి.మీ వర్షం పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇటీవల కాలంలో ఆస్ట్రేలియాలో ఒక ప్రదేశం ఈ స్థాయి వర్షపాతం చవిచూడటం ఇదే తొలిసారి అని అధికారులు భావిస్తున్నారు. ఫలితంగా నదులు, కాల్వలు కట్టలు తెంచుకొన్నాయి. కెయిర్న్స్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఇక్కడ కొన్ని విమానాలు రెక్కల వరకు నీరు నిలిచింది. కెయిర్న్స్ నగరంలో ఏకంగా 2 మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడ భారీ వరదలు విరుచుకుపడ్డాయి. భారీ సంఖ్యలో ప్రజలు ఇళ్లను వీడి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. మరికొందరు అక్కడే చిక్కుకుపోయారు. వైద్యశాలలు కూడా నీట మునిగాయి. కెయిర్న్స్ నగరంలోకి మొసళ్లు కొట్టుకొచ్చాయి. ఇప్పటికే సహాయక బృందాలు రంగంలోకి దిగినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలో దాదాపు 300 మందిని రక్షించారు.

బైడెన్ భద్రతా వాహనాన్ని ఢీకొన్న కారు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాన్వాయ్‌లోని ఒక భద్రతా వాహనాన్ని ఓ గుర్తుతెలియని ప్రైవేటు కారు ఢీకొట్టడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో అధ్యక్షుడు బైడెన్, ఆయన సతీమణి జిల్ బైడెన్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్న బైడెన్... ఆదివారం రాత్రి డెలావర్‌లోని విల్మింగ్‌టన్‌లో తన ప్రచార కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అధ్యక్ష దంపతులు వారితోనే విందు చేసిన తర్వాత తిరుగు ప్రయాణమైన సమయంలో ఒక కారు అధ్యక్షుడి కాన్వాయ్‌లోని పార్క్ చేసి ఉన్న సీక్రెట్ సర్వీస్ అధికారుల కారును ఢీకొట్టింది. తర్వాత కూడా అదే మార్గంలో వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించగా సీక్రెట్ సర్వీస్ అధికారులు ఆయుధాలతో అతడి కారును చుట్టుముట్టారు. డ్రైవర్‌ను కిందకు దిగాలని ఆదేశించారు. ఆ సమయంలో తిరిగి వెళ్లేందుకు జిల్ బైడెన్, కాన్వాయ్‌లోని వాహనంలో కూర్చోగా జో బైడెన్ కూర్చునేందుకు వెళుతున్నారు. కారు ఢీకొట్టిన శబ్దం విని బైడెన్ ఆశ్చర్యంతో అటువైపు చూశారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది జో బైడెన్‌ను సురక్షితంగా అక్కడి నుంచి అధ్యక్ష వాహనంలోకి తీసుకెళ్లారు. అధ్యక్ష దంపతుల షెడ్యూల్‌కు, కారు ఢీకొట్టిన ఘటన ఎలాంటి ఆటంకం కలిగించలేదని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. ఘటన జరిగిన సమయంలో జిల్ బైడెన్ కూర్చున్న అధ్యక్ష వాహనానికి కేవలం 130 అడుగుల దూరంలోనే బైడెన్ ఉన్నట్లు అధికారులు చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా బైడెన్ దంపతులను వెంటనే వైట్‌హౌస్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడు, ప్రథమ మహిళ సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన ఉత్తర కొరియా

ప్యాంగ్‌యాంగ్: ఉత్తర కొరియా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం)ని ప్రయోగించింది. దక్షిణ కొరియా, జపాన్‌లు ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించాయి. ఈ క్షిపణి ఆరు వేల కిలోమీటర్ల ఎత్తువరకు చేరుకుందని జపాన్ తెలిపింది. దీన్ని మరింత మెరుగైన, చురుకైన ఆయుధంగా నిపుణులు భావిస్తున్నారు. అణు కార్యకలాపాలు చేపట్టకుండా ఉత్తర కొరియాను నిలువరించేందుకు మరిన్ని ప్రణాళికలు రచించాలని దక్షిణ కొరియా, అమెరికాలు యోచిస్తున్న తరుణంలో ఆ దేశం ఈ క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఈ క్షిపణి దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. కొరియా ద్వీపకల్పం, జపాన్ మధ్య జలాల్లో పడినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. గరిష్ఠంగా 6వేల కిలోమీటర్ల ఎత్తు వరకు చేరుకుందని జపాన్ అంచనా వేసింది. ఈ ప్రయోగ ఫలితాలు ఉ.కొరియా ఈ ఏడాది జులైలో నిర్వహించిన 'హ్వాసాంగ్-18' క్షిపణి రెండో పరీక్షతో సరిపోలాయి. అంతకుముందు ఏప్రిల్‌లో తొలిసారి ఈ క్షిపణిని పరీక్షించింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ గతంలో 'హ్వాసాంగ్-18'ని తన అణ్వాయుధాల్లో అత్యంత శక్తివంతమైనదిగా పేర్కొన్నారు.

మోదీ సర్కారు బరి తెగింపు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏడాదికి రూ. 250 కోట్లు జీఎస్టీ చెల్లించింది. ఎన్ఎండీసీకి రూ. 2000 కోట్లు అప్పలు తీర్చారు. బ్యాంకులకు రుణాలు, వడ్డీలు కడుతున్నారు. అయితే సంస్థను నడిపిస్తున్న ఉద్యోగులకు మాత్రం జీతాలు ఇవ్వకుండా ఎండగడుతున్నారు. ఉత్పత్తి చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నెలకు ఉద్యోగులకయ్యే జీతం కేవలం రూ.86 కోట్లు మాత్రమే. దీనికి డబ్బులు లేవంటున్నారు. జీఎస్టీ రూ. 250 కోట్లు కట్టడానికి మాత్రం నిధులు సమస్య లేదా? ఇది కావాలని చేస్తున్న కుట్రగానే భావించాల్సి ఉంటుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 5వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, గనులు, ముడిసరుకు ఇవ్వాలని, పూర్తి స్థాయి సామర్థ్యంతో ప్లాంటును నడపాలని... అలాగయితే ఒక్క సంవత్సరంలో సంస్థను లాభాల బాట పట్టిస్తామని కార్మికులు చెబుతున్నారు. అయినా కూడా మోదీసర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్లకు రూ.16లక్షల కోట్లు రుణమాఫీ చేయడానికి కేంద్రానికి చేతులు వచ్చాయి తప్ప, లక్షమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కుకు మాత్రం కేవలం రూ.5వేల కోట్లు ఇవ్వడం లేదు. ఇది ద్రోహం కాదా అని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

కేంద్రం ఇంత ద్రోహానికి పూనుకుంటే ఎందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిలదీయడం లేదని... ప్లాంటును ప్రైవేటు పరం కాకుండా కాపాడే కృషి ఎందుకు చేయడం లేదని, మీకు బాధ్యత లేదా అని విశాఖ ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ మిత్రపక్షం జనసేన, జనసేన మిత్రపక్షం తెలుగుదేశం పార్టీలు కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, ప్రత్యక్ష పోరాటం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ముగ్గురూ ఈ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే మాకు ముఖ్యం అందుకే మా పయనం అంటున్నారు సరే... స్టీల్‌ప్లాంటు ను, ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుండా రాష్ట్ర ప్రయోజనాలు ఎలా సాధ్యం అవుతాయని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఈ పార్టీలు తమ రాజకీయ ప్రాధాన్యతలను ప్రక్కనపెట్టి మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలని, స్టీల్‌ప్లాంటు రక్షణకు పార్లమెంటు లోపల, బయట ఉద్యమం నిర్వహించాలని కార్మిక సంఘాలు, ఉక్కు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. విశాఖ ఉక్కును జిందాల్, ఇతర ప్రయివేటు శక్తులకు కట్టబెట్టే మోదీ సర్కారు కుట్రలు సాగనీయకుండా చేసి ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంలో నడిపే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భూములు బదలాయించం

(మొదటిపేజీ తరువాయి)

ఇస్కో సేలం, అలాయ్, విశ్వేశ్వరయ్య ఐరన్ స్టీల్ ప్లాంట్‌లు నెలకొల్పిన భూములకు ఆయా ప్లాంట్‌లే యాజమాన్య హక్కులు కలిగి ఉన్నాయి. రూర్కేలా స్టీల్ ప్లాంట్ భూములు మాత్రం లీజు పద్ధతిలో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

కేజ్రీవాల్‌కు ఈడీ మళ్లీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

చట్టవిరుద్ధమైనవి. రాజకీయ ప్రేరేపితమైనవి. బీజేపీ సూచన మేరకే వాటిని పంపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నన్ను దూరం చేసేందుకు వీటిని జారీ చేశారు. తక్షణమే సమన్లను ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో తాజాగా మరోసారి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది.

పేదల సంజీవని ఆరోగ్యశ్రీ

(మొదటిపేజీ తరువాయి)

మంది వైద్య సిబ్బందిని నియమించామని, జాతీయస్థాయిలో నర్సుల కొరత 27 శాతం అయితే, మన రాష్ట్రంలో సున్నాగా ఉందన్నారు. జాతీయస్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత 33 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా స్థాయికి తీసుకువచ్చామన్నారు. నూటికి నూరుశాతం భర్తీ చేశామని, ప్రివెంటివ్ కేర్‌లో భాగంగా 10,032 విలేజ్ క్లినిక్కులు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నామని, ఇవన్నీ వైద్య, ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పులుగా సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జె.నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి.మురళీధర్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, గృహనిర్మాణశాఖ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దీవాన్ మైదీన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ సీఈఓ డీకే బాలాజీ, ఐజీ జి.పాలరాజు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సెల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, ఆరోగ్యశ్రీ సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయం 'యువగళం'

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, 2,028 గ్రామాల మీదుగా 226 రోజులపాటు పాదయాత్ర సాగింది. సోమవారం ముగించే సమయానికి లోకేశ్ 3,132 కి.మీ. నడిచినట్లయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'వస్తున్నా మీకోసం' పాదయాత్రనూ ఆగనంపూడి వద్దే ముగించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 577 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించగా, కర్నూలులో 507 కిలోమీటర్లు, నెల్లూరులో 459 కిలోమీటర్లు అత్యధికంగా ఎక్కువరోజులపాటు పాదయాత్ర కొనసాగింది. అదే సెంటిమెంటుతో ఇప్పుడు లోకేశ్ కూడా అక్కడే తన పాదయాత్ర ముగించారు. పాదయాత్ర ప్రారంభించిన దగ్గర నుంచి ముగింపు వరకు లోకేశ్ అనేక ఇబ్బందులను, ప్రభుత్వం నుంచి సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా జీవో 1 తీసుకొచ్చి పాదయాత్రను భగ్నం చేసేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా అవరోధాలు సృష్టించింది. ఒకపక్క పోలీస్ ఆంక్షలు, మరోపక్క అధికారపార్టీ శ్రేణుల కవ్వింపు చర్యలను తట్టుకుంటూ యువగళం ముందుకు సాగింది. కుప్పంలో పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గం చేరేలోపు పోలీసులు 25 కేసులు నమోదుచేయగా, వాటిలో మూడు లోకేశ్‌పైనే ఉన్నాయి. ప్రచారరథం, సౌండ్‌సిస్టమ్, స్టూల్ సహా అన్నింటినీ సీజ్ చేశారు. భీమవరం, ఉంగుటూరు, గన్నవరం, నూజివీడు లాంటిచోట్ల వైసీపీ నాయకులు, పోలీసులు కుమ్మక్కై టీడీపీ శ్రేణుల్ని రెచ్చగొట్టేలా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. తిరిగి వారిపైనే కేసులు పెట్టారు. 40మంది యువగళం వలంటీర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపారు. గన్నవరం నియోజకవర్గంలో విదేశాల్లో ఉన్నవారు సహా 46 మందిపై తప్పుడు కేసులు పెట్టారు. యువగళం ఫ్లెక్సీలు చించడం, రాళ్లు రువ్వడం లాంటి దుర్మార్గాలకు పాల్పడ్డారు. ఇవన్నీ లోకేశ్‌కి అనేక అనుభవాలు నేర్పగా, రాజకీయంగా యువగళం పాదయాత్రతో మరింత పరిణతి చెందారు. తారకరత్న మరణం, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తదితర సందర్భాల్లో తప్ప విరామం లేకుండా పాదయాత్ర కొనసాగించారు. అయితే సెప్టెంబరు 9న తండ్రి చంద్రబాబును ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు చేయడంతో పాదయాత్రకు సుదీర్ఘ విరామం ఏర్పడింది. చంద్రబాబుపై కేసులు మీద కేసులు పెట్టడంతో యువగళం యాత్ర కూడా ముందుకు సాగే అవకాశం లేదని, లోకేశ్‌ను ప్రభుత్వం జైలుకి పంపుతుందని టీడీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమైంది. అయినప్పటికీ లోకేశ్ మొక్కవోని దీక్షతో ...తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం పొదలాడ వద్ద ఆపిన యువగళం పాదయాత్రను 79 రోజుల తర్వాత నవంబరు 27న మళ్లీ అక్కడినుంచే ప్రారంభించారు. యువగళం ముగింపు సందర్భంగా ఈ నెల 20వ తేదీ విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద పాదయాత్ర విజయోత్సవ సభను భారీ ఎత్తున నిర్వహించేందుకు పార్టీ విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది.

నియంతృత్వంపై ప్రజాయుద్ధమే యువగళం: లోకేశ్

విశాఖ జిల్లా ఆగనంపూడి వద్ద పాదయాత్రను ముగించిన లోకేశ్... అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ అసమర్థుడు గద్దెనెక్కి ప్రజాస్వామ్యంపై దాడి చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, వ్యవస్థలపై చేసిన దాడిని కళ్లారా చూశాను. భవిష్యత్‌పై ఆశలు కోల్పోయిన యువతకు భరోసా ఇచ్చాను. పాదయాత్రలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటాను. నియంతృత్వంపై ప్రజాయుద్ధమే యువగళం. యువగళం అణచివేతకు గురైన వర్గాల గొంతుకైంది. యువగళం.. ప్రజాగళమై నిర్విరామంగా సాగిందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు లోకేశ్ ఒక రెడ్‌బుక్(డైరీ)లో ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ నేతల చరిత్రను లిఖించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పుడు నేతల అంతుచూస్తామని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.

ఎల్‌అండ్‌టీ ప్రతినిధులపై మంత్రి ఉత్తమ్ ఫైర్

విశాలాంధ్ర-హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజ్ పనుల విషయంలో ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం సచివాలయంలో మేడిగడ్డ బ్యారేజ్ పనులు చేసిన ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులతో అయన సమావేశమయ్యారు. సమావేశంలో పాల్గొన్న ఎల్ అండ్ టీ గ్రూప్ డైరెక్టర్ ఎస్.వి.దేశాయ్ పలువురు ప్రతినిధులతో అయన మాట్లాడారు. అంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణ విషయంలో ఎలా నాసిరకం పనులు చేశారని నిలదీశారు. ఇంత నాణ్యత లేకుండా ఎలా చేస్తారంటూ మండిపడినట్లు సమాచారం. ఏదో ఒక లెటర్ అధికారికి ఇచ్చి మా ప్రమేయం లేదు అని తప్పించుకోవాలంటే ఊరుకోమని ఉత్తమ్ వారిని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని వృథా చేసి ప్రాజెక్టు కూలిపోవడానికి కారణమైన ఎవ్వరిని వదిలిపెట్టమని మంత్రి స్పష్టం చేశారు. పూర్తి స్థాయి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అన్నారం, సిందిళ్ల ప్రాజెక్టు నిర్మాణ ఏజెన్సీలను కూడా పిలిచి మాట్లాడాలని, తప్పు చేసినవారిపై న్యాయ పరంగా, చట్ట పరంగా చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

పాలకులు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

జగన్‌మోహన్ రెడ్డి చెబుతున్నారని, అయితే సీఎం జగన్ అహంకార ధోరణి వల్లే రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలవుతుందన్నారు. రాష్ట్రంలో 460 మండలాల్లో కరువు ఉంటే ముఖ్యమంత్రి కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి కరువుతో ఇబ్బందులు పడుతున్న మండలాలైనా పరిశీలించకపోవడం దుర్మార్గమన్నారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నాయని, రైతులు వాటికి పెట్టిన పెట్టుబడులు కూడా రాలేకపోవడంతో అప్పుల పాలయ్యారన్నారు. మరోవైపు, కోస్తా ప్రాంతంలో తుపాను కారణంగా పంటలు తడిసి ముఖ్యంగా వరి, పసుపు, పత్తి, అరటి దెబ్బతినడంతో భారీగా నష్టపోయారని తెలిపారు. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే సీఎం జగన్ పంటలను పరిశీలించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ రైతులకు ఏమన్నా చేశాడా, కోస్తా ప్రాంతాలకు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఏమన్నా చేశాడా అని ప్రశ్నించారు. కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేస్తానని పాదయాత్ర సందర్భంగా చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోతే ఇంతవరకు పట్టించుకోలేదని విమర్శించారు. అంగన్‌వాడీలు, న్యాయవాదులు నేడు రోడ్లు ఎక్కి ఆందోళన చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 2024 ఎన్నికలలో మోదీని గద్దె దించుదామని, జగన్‌ను ఇంటికి పంపించాలని, దీనికి ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలన్నారు.

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రోజూ 28 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో లక్షన్నర మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 3,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ప్రజలను మోదీ, జగన్ మోసం చేస్తున్నారని, వారిపై 420 కేసు పెట్టాలన్నారు. పాలకులు రైతులను దగా చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారన్నారు. జనవరి 8,9 తేదీలలో రాజమహేంద్రవరంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని, హంద్రి-నీవా ప్రధాన కాలువ కింద అంతర్గత కాలువలు తీసి పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. కరువుతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణాలు మాఫీ చేయాలని, 65 సంవత్సరాలు దాటిన రైతుకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో రైతు సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సభలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.గిడ్డయ్య, జిల్లా అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నభిరసూల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, పి.రామకృష్ణారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌బాషా, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మెక్సికోలో దారుణం...

దుండగుడి కాల్పుల్లో 16 మంది మృతి

మెక్సికోసిటీ: మెక్సికో దేశంలో కాల్పుల మోత మోగింది. గువానాజువాటో రాష్ట్రంలోని సాల్వాటియెర్రా పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున క్రిస్మస్ సీజన్ పార్టీ నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తున్నవారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 16 మంది దుర్మరణం చెందారు. అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. 'పోసాడా' అని పిలిచే క్రిస్మస్ పార్టీ తర్వాత ఈవెంట్ హాల్ నుంచి జనాలు బయటకు వస్తున్న సమయంలో దుండగుడు కాల్పులకు తెగబడ్డాడని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా మెక్సికోలోని సలామాంకా నగరంలో జరిగిన మరో కాల్పుల ఘటనలో నలుగురు వ్యక్తులు మరణించారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. కాగా... మెక్సికో రాజధాని మెక్సికో సిటీకి నైరుతి దిశలో 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న టెక్స్‌కల్‌టిట్లాన్ గ్రామంలో చోటుచేసుకున్న ఘర్షణ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

మోదీ, అమిత్‌షా నోరు విప్పాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

వెలుపల ప్రకటనలు చేస్తున్నారు. పార్లమెంటులో ఎందుకు మాట్లాడటం లేదు. ఇది తీవ్రమైన అంశం' అని రాజా విమర్శించారు. 'ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లౌకిక, ప్రజాస్వామిక శక్తుల ఐక్యతను చాటి చెబుతున్నాయి. ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన అవసరం ఉంది' అని రాజా స్పష్టంచేశారు. తెలంగాణలో కాంగ్రెస్, సీపీ కూటమి విజయం ప్రోత్సాహకరంగా ఉందని రాజా వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితిని, రాష్ట్ర ప్రజలను పార్టీ జాతీయ కార్యవర్గం అభినందించిందని చెప్పారు. 2024 పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ నాయకత్వ అహంకారం, విభజన రాజకీయాలు పెరిగాయని ఆయన విమర్శించారు. ఇండియాలో భాగస్వామిగా బీజేపీని ఓడించడానికి సీపీఐ కృతనిశ్చయంతో ఉందన్నారు. బీజేపీని ఓడించడానికి దేశంలోని అన్ని వామపక్ష, ప్రజాస్వామిక, లౌకికశక్తులు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. '2024లో తిరిగి ప్రధానమంత్రినవుతానని మోదీ చెబుతున్నారు. భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని గొప్పలు పోతున్నారు. కానీ వాస్తవం భిన్నంగా ఉంది' అని రాజా చెప్పారు. 'మోదీ విధానాలు దేశాన్ని సర్వనాశనం చేసినట్లు రుజువైంది. మోదీ విధానాలలు పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు భారీగా లబ్ధిపొందాయి. మరోవైపు, సామాన్యుల జీవితాలు దుర్భరమయ్యాయి' అని రాజా విమర్శించారు. మోదీ ప్రభుత్వ తప్పుడు విధానాలతో దళితులు, ఆదివాసీలపై అకృత్యాలు పెరిగిపోయాయని చెప్పారు. మోదీ, ఆయన ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదని, దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని, నిరుద్యోగం కనీవినీ ఎరుగని విధంగా పెరిగిందని, ధరల పెరుగుదలకు అంతేలేదని, రూపాయి విలువ ఘోరంగా పతనమైందని రాజా విమర్శించారు. ఆకలి సూచీలో 120 దేశాల్లో భారత్ 111వ స్థానానికి పడిపోవడాన్ని మనం చూశామన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని, దీని ప్రకారం గడచిన 9 ఏళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో దేశంలో నెలకొన్న పరిస్థితుల గురించి చర్చించామన్నారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఇండియా కూటమిని బలోపేతం చేయాలని నిర్ణయించామని రాజా చెప్పారు. పార్లమెంటులో సంఖ్యాబలం పెంచు కోవడానికి గాను దేశవ్యాప్తంగా సహేతుక సంఖ్యలో సీపీఐ పోటీ చేస్తుందని వివరించారు.

78 మంది ఎంపీల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

వేటు పడిన విషయం తెలిసిందే. గత గురువారం వారిపై వేటు వేశారు. దీంతో ఈ సమావేశాల్లో ఇప్పటివరకు మొత్తం 46 మందిని లోక్‌సభ నుంచి సస్పెండ్ చేసినట్లయింది.

రాజ్యసభలో 45 మందిపై...

రాజ్యసభలో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రకటించారు. కాంగ్రెస్ ఎంపీలు జైరాం రమేశ్, రణ్‌దీప్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్ సహా ఇతర విపక్ష పార్టీల నేతలపై వేటు పడింది. వీరిలో 34 మందిని ఈ శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయగా... మరో 11 మందిని ప్రివిలేజెస్ కమిటీ నివేదిక అందే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ఇప్పటికే రాజ్యసభలో టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియెన్‌పై ఈ శీతాకాల సమావేశాలు ముగిసేవరకు సస్పెన్షన్ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. 'భద్రతా వైఫల్యం'పై విపక్షాలు ఎంతకీ వెనక్కి తగ్గకపోవడంతో ఉభయ సభలను సభాపతులు మంగళవారానికి వాయిదా వేశారు.

కోవిడ్ అప్రమత్తత

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది. అప్రమత్తంగా ఉంటూ, కొత్త కేసులపై నిఘా ఉంచాలని ఆదేశించింది. ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలని, వేరియంట్ తెలుసుకునేందుకు జీనోమ్ సీక్వెన్స్ టెస్టులు నిర్వహించాలని సూచించింది. వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సంసిద్ధతలను పరీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ చేపడుతున్న మాక్ డ్రిల్స్‌లో భాగస్వామ్యం కావాలని సూచించింది.

కొత్తగా కేసులు 260, క్రియాశీల కేసులు 1,820

సోమవారం నవీకరించబడిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో 335 కొత్త కరోనా వైరస్ ఇన్ఫెక్షన్లు నమోదు కాగా, క్రియాశీల కేసులు 1,828కి పెరిగాయి. కేరళలో నలుగురు, యూపీలో ఒకరు మృతి చెందారు. కేరళ, కర్నాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోనే అత్యధిక కేసులు నమోదయ్యాయి. కర్నాటక సోమవారం 60 ఏళ్లు పైబడిన వారు, ఇతర అనారోగ్యాలు, దగ్గు, కఫం, జ్వరం లక్షణాలు ఉన్నవారు మాస్క్‌లు ధరించమని కోరింది.

నెలాఖరు వరకే సమయం

అగ్రిగోల్డ్ బాధితులకు సొమ్ము చెల్లింపు తేదీ ప్రకటించండి

లేకుంటే జనవరి 15 నుంచి ఉద్యమ రూపం మారుతుంది : ముప్పాళ్ల హెచ్చరిక

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: అగ్రిగోల్డ్ బాధితులను కారుణ్య మరణాలకు అనుమతి ఇస్తారా... లేకుంటే బాధితులకు డబ్బులు ఇచ్చే తేదీని ఈ నెలాఖరు లోపు ప్రకటించి న్యాయం చేస్తారో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం స్థానిక స్వార్ట్ బజార్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మోసం చేయడంతో తొమ్మిది సంవత్సరాలుగా బాధితులు వీధులు పాలయ్యారని, 600 మందికి పైగా ఆత్మహత్యలు, మరణాలకు గురయ్యారని తెలిపారు. ఆత్మహత్యలకు గురైన 142 మంది కుటుంబాలకు గత ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ఇచ్చిందన్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు వారి ఇంటికి పంపుతామని, బాధితులందరికీ ఆరు నెలల్లో పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జగన్ హామీ మేరకు బాధితులు వైసీపీ ప్రభుత్వానికి ఓట్లు వేసి అధికారంలోకి రావడానికి కారణమయ్యారని తెలిపారు. మరో మూడు నెలల్లో వైసీపీ ప్రభుత్వ కాల పరిమితి పూర్తవుతుందని, కానీ అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అలాగే ఉందని తెలిపారు. కంపెనీ యాజమాన్యం విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని, బాధితులు మాత్రం దిగులుతో మరణిస్తున్నారన్నారు. తాము ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయీ అడగడం లేదని, కంపెనీకి చెందిన రూ.30 వేల కోట్ల ఆస్తులు ప్రభుత్వం చేతిలో ఉన్న వాటి నుంచి ముదస్తు చెల్లింపులుగా రూ.3,080 కోట్లు ఇచ్చి ఆదుకోవాలని నాలుగు సంవత్సరాలుగా అడుగుతున్న ప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఇదే చివరి అవకాశమని, అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే జనవరి 15వ తేదీ తర్వాత బాధితుల ఉద్యమం రూపం మారిపోతుందన్నారు. ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకుని బాధితులకు సత్వరమే సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ జగన్ మాటలు నమ్మి రాష్ట్రంలో ఉన్న 19 లక్షల అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలు గత ఎన్నికల్లో ఓటు వేసి జగన్ అధికారంలోకి రావడానికి కారణమయ్యారు. నేడు అదే బాధితులు తక్షణమే న్యాయం చేయాలని అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. బాధితులకు న్యాయం జరగకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతోనే జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారని, బాధితులందరికీ పూర్తి న్యాయం చేయనిపక్షంలో రానున్న ఎన్నికల్లో జగన్ పార్టీని ఇంటికి పంపించేందుకు బాధితులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏ పార్టీ అయితే వారి మేనిఫెస్టోలో పెట్టి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇస్తారో, అసోసియేషన్, సీపీఐ ఎవరికి చెప్తే వారికి ఓట్లు వేయడానికి బాధితులు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జాయిం ట్ కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గుంటూరు నగర గౌరవాధ్యక్షులు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ కరిముల్లా, అసోసి యేషన్ నాయకులు అడ్డగాళ్ల వెంకటేశ్వరరావు, పీవీ సాంబశివ రావు, వై.పెదరామయ్య, ఎ.నాగరాజు, ఎ.ప్రసాద్ బాబు, ఎస్.కె.వై.మస్తాన్ వలి, యు.యాదగిరి, టి.వెంకటేశ్వరరావు, ఇర్.ఇన్నయ్య, అచ్చమ్మ, సుజాత, సంజీవయ్య, కొండలరావు, గౌస్ బాషా, టి.మోహన్, సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, జంగాల చైతన్య, బందెల నాసర్‌జీ, ఖాజా, ఎస్.కె.బాజీ, నాగరాజు, ఇలియాస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నూతన డైరెక్టర్ ఎస్ఎస్ త్రిపాఠి

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఎస్ ఆర్ఎం యూనివర్సిటీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ విభాగం నూతన డైరెక్టర్‌గా సిద్ధార్థ్ శంకర్ త్రిపాఠీ సోమవారం బాధ్యతలు స్వీక రించారు. హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి త్రిపాఠీకి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగంలో విశేషమైన అనుభవం ఉంది. ఆసియాలో మొట్ట మొదటి సేల్స్ అండ్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ కంపెనీ బ్రాండ్ గైన్‌ను, గ్లోబల్ న్యూస్ సోర్స్ న్యూస్ వార్క్‌ను స్థాపించిన వ్యక్తిగా త్రిపాఠీకి దేశీయంగా ఎంతో పేరుంది. తన సొంత సంస్థ స్కిలిజెన్ లెర్నింగ్ ద్వారా 72 దేశాల్లో యువతకు లైఫ్ స్కిల్స్ శిక్షణ అందించడం ద్వారా త్రిపాఠీ అంతర్జాతీయంగానూ పేరు గడించారు. ఎంతో పేరు ప్రఖాతులున్న త్రిపాఠీ ఏపీ ఎస్ఆర్ఎంలో డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం తమకెంతో సంతోషంగా ఉందని యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్య నారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా ఆనందం వ్యక్తం చేశారు.

మనువాద ధోరణి మహిళాభివృద్ధికి అడ్డంకి

చంద్ర రాజకుమారి వర్ధంతి సభలో ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: సమాజంలో మనువాద ధోరణి మహిళాభివృద్ధికి అడ్డంకిగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ ఓబులేసు అన్నారు. మహిళా ఉద్యమ నేత చంద్ర రాజకుమారి 5వ వర్ధంతి సందర్భంగా 'మహిళలు-మనువాద ధోరణులు' అనే అంశంపై ఆయన స్మారకోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి అధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఏ విమల అధ్యక్షతన స్థానిక దాసరి భవన్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మహిళలను అవమానాలకు గురి చేసే అంశాలు మనుధర్మశాస్త్రంలో ఉన్నాయన్నారు. 2500 ఏళ్ల క్రితం మహిళలను కట్టుబానిసలుగా చేశారని తెలిపారు. అది నేటికీ మన సమాజంలో కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ సర్కారు నూతన పార్లమెంట్ భవన్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించ లేదన్నారు. మహిళా రెజ్లర్లను అవమానించటం, మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనలు... దేశంలో మహిళపట్ల జరుగుతున్న అఘాయిత్యాలకు నిదర్శనంగా ఉన్నాయని చెప్పారు. ఇటీవల మహిళా న్యాయమూర్తులను, పురుష న్యాయమూర్తులు వేధింపులకు గురి చేస్తున్నట్లు వార్తలు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వం మహిళలు ఎదుర్కొన్న సమస్యలను ఆయన వివరించారు. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు 2029 నాటికి అమలులోకి వస్తాయని చెప్పటం మహిళలను మోసం చేయటమే అవుతుందన్నారు. బేటీ బచావో, బేటీ పడావో నినాదాలు కేవలం నినాదాలకే పరిమితం అవుతున్నాయని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను కులాలు, మతాలు, వర్గాలుగా విభజించి అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు విద్యావంతులు కావాలని, చరిత్రను అధ్యయనం చేయాలని ఆయన ఉద్బోధించారు. రాజకుమారి బాటలో మహిళలు ప్రయాణం చేయాలని సూచించారు. చంద్ర రాజకుమారి మితభాషి, ఆచరణాత్మకవాది అని కొనియాడారు. అశ్లీల పోస్టర్‌లపై విశ్లేషణ చేసి వాటికి వ్యతిరేకంగా పోరాటం చేశారని వివరించారు.

ముందుగా చంద్ర రాజకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విప్లవగీతాలు, మహిళా సమాఖ్య సాధించిన విజయాలతో కూడిన గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ దుర్గాభవాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ పంచదార్ల దుర్గాంబ, ఉపాధ్యక్షురాలు కే స్వాతి, కార్యదర్శులు పావని, యామిని, శ్రావణి, సమాఖ్య నేతలు మంజరి, డాక్టర్ సుజాత, పీ సంధ్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్' లక్ష్యం

గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర -తిరుపతి: 2047 నాటికి భారత్ మహా శక్తివంతమైన దేశంగా నిలవనున్నదని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ భారతి, జిల్లా కలెక్టర్ కే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్, కమిషనర్ శ్రీమతి శిరీష, హరిత, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ ... సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికీ అందేలా అవగాహన కల్పించడంతో పాటు కోట్లాది మంది పౌరుల నిర్లక్ష్య భావనను దూరం చేయడం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యమన్నారు. 2047 నాటికి స్వావలంబన, అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క లక్ష్యాన్ని సాధించడం, భారత ప్రభుత్వ పథకాల సంతృప్తతను సాధించాలన్నారు. వివిధ పథకాల కింద అర్హులై ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రయోజనాలను పొందని బలహీన వర్గాలను చేరుకోవడానికి సమాచార వ్యాప్తి, పథకాల గురించి అవగాహన కల్పించడం యాత్ర ముఖ్య ఉద్దేశం అన్నారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన,జల్ జీవన్ మిషన్, కిసాన్ సమ్మాన్, పోషణ్ అభియాన్, ఉజ్వల యోజన, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, భారతీయ జన్ ఔషధి పరియోజన తదితర సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేద ప్రజల సంక్షేమానికి ఎంతగానో తోడ్పడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒకట్రెండు సర్క్యులర్లకు సమ్మె ఆగదు

మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒకట్రెండు సర్క్యులర్లకు మున్సిపల్ సమ్మె ఆగబోదని మున్సిపల్ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు, కో కన్వీనర్లు వైవీ రమణ, పరుచూరి ప్రసాద్, ఆసుల రంగనాయకులు, శంకర్రావు తెలిపారు. జేఏసీ నేతలు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల 21 డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 7న సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. దీనిపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, సీడీఎంఏ కోటేశ్వరరావు ఈనెల 14న సచివాలయంలో తమతో సుదీర్ఘ చర్చలు జరిపి...సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు ఒప్పంద అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను 62 ఏళ్ల వరకు పదవీ విరమణ పెంచుతూ సర్క్యులర్ జారీ చేశారని, మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు జీవో నెంబర్ 25ను మూడు నెలల్లోపు అర్జీ పెట్టుకున్న వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించే జీవోలపై సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఇతర డిమాండ్లపై ఇంకా స్పందించలేదని, కావున రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె జయప్రదం కోసం అన్ని వర్గాల వారితో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

ఆ కండక్టర్లను కడప జిల్లాకు బదిలీ చేయాలి

ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇతర జిల్లాలలో 14 ఏళ్లుగా పనిచేస్తున్న కడప జిల్లా ఆర్టీసీ కండక్టర్లను తిరిగి ఆ జిల్లాకు బదిలీ చేయాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం లేఖ రాశారు. కడప జిల్లాలో 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నిర్వహించిన కండక్టర్ల నియామకాల ద్వారా 287 మంది ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. ఆర్టీసీ కండక్టర్లు కడప జిల్లాలో ఖాళీలు లేవని 14 సంవత్సరాలు సుదీర్ఘ కాలం తెలంగాణలోనూ, ప్రస్తుతం అనంతపురం, కర్నూలు జిల్లాలలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌కు పంపారన్నారు. ఈయూ పోరాటాల మేరకు 187 మందిని కడప జిల్లాకు ఇచ్చినప్పటికీ, ఇంకా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 60 మంది, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కండక్టర్లను వారి సొంత జిల్లా కడపకు పంపించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-మేడికొండూరు: మహారాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీలను కార్మికు లుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాం డ్ చేశారు. సోమవారం మేడికొండూరు మండల కేంద్రంలో ఏడవ రోజు జరిగిన అంగన్‌వాడీల నిరసన సభకు ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేసే కార్మికులకు చట్టపరంగా గ్రాడ్యుటీని ప్రభుత్వాలు అమలు చేయాలని ఆయన కోరారు. వేతనాలు పెంచి వారి న్యాయపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే తెలంగాణకు మించిన జీతాలు అంగన్ వాడీలకు ఇస్తామని చెప్పి... అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యా రన్నారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో అంగన్‌వాడీలకు ఇచ్చే ప్రస్తుత జీతాలు ఏమాత్రం సరిపోవని అన్నారు. అంగన్‌వాడీలు చేపట్టే నిరసన కార్యక్రమాలకు ఏఐటీయూసీతో పాటు వివిధ ప్రజా సంఘాలు, అనేక రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ బెదిరింపు చర్యలకు అంగన్‌వాడీలు భయపడకుండా తమ న్యాయమైన కోరికలు సాధించేవరకు సమ్మెను కొనసాగించాలని, వారు చేసే సమ్మెకు ఏఐటీయూసీ పూర్తిస్థాయి మద్దతు తెలుపుతుందని ఆయన తెలిపారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులతో పాటు మండల స్థాయి తెలుగుదేశం, జనసేన నాయకులు అంగన్‌వాడీల నిరసనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభతోనే రాణింపు

26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభంలో నాగరాణి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోటీ ప్రపంచంలో బహుముఖ ప్రతిభ కనబరిచినప్పుడే ఆశించిన లక్ష్యాలు సాధించగలుగుతామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడావిభాగంలో సైతం విద్యార్థులు తమదైన ప్రతిభ చూపాలన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను కమిషనర్ ప్రారంభిం చారు. అతిథ్య జట్టు నుండి క్రీడాజ్యోతి స్వీకరించిన నాగరాణి... శాంతి కపోతాలు ఎగురవేసి క్రీడలు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో క్రీడా సౌకర్యాల పెంపునకు అవ సరమైన చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. క్రీడలతో విద్యార్థులు మానసిక వత్తిడిని అధిగ మించి మరింతగా విద్యపై దృష్టి నిలపగలుగు తారని చెప్పారు. ఈ క్రీడాపోటీలలో కృష్ణా రీజియన్ నుంచి 19 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 508 మంది క్రీడాకారులు తమ సత్తా చాటేందుకు పోటీ పడుతున్నారు. మొత్తం 18 రకాల క్రీడాంశాలలో ఈ పోటీలు జరుగు తున్నాయి. సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి కేవీ రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకిరామయ్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జేఎస్ఎన్ మూర్తి, ఉపసంచాలకులు కె.విజయభాస్కర్, ఎంవీ రామ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కానివ్వం

టీడీపీ యువ నేత నారా లోకేశ్

వినతిపత్రం సమర్పించిన నిర్వాసితుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖ పట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ కానివ్వబోమని టీడీపీ యువ నేత నారా లోకేశ్ అన్నారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్య వేదిక సంఘం ప్రతినిధులు సోమవారం లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములిచ్చిన 8,500 మంది నిర్వాసితుల సమస్యలు 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, స్టీల్ ప్లాంట్ కోసం పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి, అగనంపూడి పంచాయతీల్లోని 64 గ్రామాల్లోని 26 వేల ఎకరాలు తీసుకుని ఖాళీ చేయించారని, భూయజమానులకు ఎకరాకు రూ.1,250 మాత్రమే అప్పట్లో పరిహారం ఇచ్చారని పోరాట కమిటీ ప్రతినిధులు వివరించారు. చదువుతో సంబంధం లేకుండా ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే అనేక పోరాటాల ద్వారా 5 వేల మంది నిర్వాసితులకు ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇచ్చారని, నిర్వాసితులకు కొన్నేళ్లకు జీవో 35 తీసుకువచ్చి ఆర్ కార్డులు కుటుంబ సభ్యులకు బదిలీ విధానం తెచ్చారన్నారు. అప్పటి నుంచి 8 వేల మంది నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చారని, మరో 8,500 మందికి ఇవ్వలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం ప్రైవేటీకరణ చేస్తామని చెబుతోందని, ఇదే జరిగితే నిర్వాసితులు ఘోరంగా నష్టపోతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకుంటామని తెలిపారు. 22,500 ఎకరాల్లో విస్తరించి ఉన్న విశాఖ ఉక్కు విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.3 లక్షల కోట్లకు పైమాటే అని, విశాఖ ఉక్కు ఇప్పటి వరకు రూ.40 వేల కోట్లను వివిధ పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్రాలకు చెల్లించిందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న ఇటువంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థను ప్రైవేటీకరణ చేస్తుంటే కేసులకు భయపడి జగన్‌మోహన్ రెడ్డి నోరు మెదపడం లేదని తెలిపారు. కొందరు బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కై ఖాళీగా ఉన్న సుమారు 8 వేల ఎకరాల భూములను అడ్డగోలుగా దోచుకునేందుకు జగన్ వ్యూహరచన చేశాడన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై పార్లమెంటులో మా గళాన్ని వినిపిస్తామని, నిర్వాసితులకు అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. విశాఖ ఉక్కు మనుగడకు అవసరమైన క్యాప్టివ్ మైన్స్, కాస్ట్ కటింగ్ వంటి అంశాలపై దృష్టి సారించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు. విశాఖ స్టీల్ ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. విశాఖ ఉక్కు నిర్వాసితులు, ఆర్ కార్డుదారులకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉక్కు పరిరక్షణ పోరాట నేతలు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం సారధ్యంలో లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కబుర్లొద్దు... ముందు రోడ్లు వెయ్యి జగన్

గాజువాక యువగళంలో నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సీఎం జగన్ కబుర్లు చెప్పకుండా ముందు రహదారుల నిర్మాణం చేపట్టాలని టీడీపీ యువ నేత నారా లోకేశ్ డిమాండ్ చేశారు. యువగళం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నగరంలోని ఒక రహదారిని పరిశీలించారు. గ్రేటర్ విశాఖ పరిధిలో నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే స్టీల్ ప్లాంట్ సమీపంలోని గాజువాక కణితిరోడ్డు గోతులమయంగా మారడంపై విస్మయం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పన్నుమీద పన్నుతో కోట్లాది రూపాయలు దోచుకుంటున్న సైకో ప్రభుత్వం విశాఖలాంటి మెట్రోపాలిటన్ నగరాల్లో రోడ్ల మరమ్మతులు కూడా చేయకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు. విశాఖ మహానగర రోడ్లపై తట్టమట్టి పోయడం చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి... రాజధాని చేసేస్తానంటూ బిల్డప్ బాబాయ్ కబుర్లు చెబుతున్నాడని అన్నారు. 10 కి.మీ.ల దూరానికి హెలికాప్టర్‌లో వెళ్లే ఈ రిచెస్ట్ సీఎంకు నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తెలుస్తాయా? ఆలోచించండి అని విశాఖ నగర ప్రజలను కోరారు.

కార్మిక పోరాటాలను ఉధృతం చేద్దాం

ఏఐటీయూసీ సభలో నేతల పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దీర్ఘ కాలిక సమస్యల సాధన కోసం కార్మికులు పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా నిర్మాణ బాధ్యులు నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రెండవ రోజు సోమవారం ఏఐటీయూసీ ప్రతినిధుల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి మురళి, నాగసుబ్బారెడ్డి మాట్లాడారు. 104 ఏళ్ల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు శ్రీకాళహస్తిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి ప్రాంతం పరిశ్రమలకు నిలయం అన్నారు. ఇది పోరాటాల గడ్డ అని.. ఇలాంటి చోట సంఘ నిర్మాణం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమ విస్తరణకు కొత్త సంఘాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. రాష్ట్రంలో జగన్ సర్కారు నియంతృత్వ పోకడలతో సమ్మె హక్కును కూడా కాలరాస్తోందని విమర్శించారు. అసంఘటిత కార్మికులు ఏకతాటిపైకి వచ్చి పాలకుల మెడలు వంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్మికుల చట్టాలను కాపాడుకోవాలని, లేబరు కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం చేయాలన్నారు. జగన్ సర్కారు కార్మికులకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే అంగన్‌వాడీలకు అండగా ఏఐటీయూసీ ఉద్యమంలోకి దిగుతుందని హెచ్చరించారు. అంతకు మునుపు ఏఐటీయూసీ ప్రతినిధుల సభ ప్రారంభోత్సవ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కార్మిక జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆఫీసు బేరర్లు శ్రీరాములు, చంద్రశేఖర్ రెడ్డి, సీహెచ్ శివకుమార్, ఎన్.డి.రవి, వైఎస్ మణి, శివ, కె.వై.రాజా, చలపతి, చంద్రబాబు, చాముండేశ్వరి, ఉదయ్, చంద్రయ్య, నాగేంద్ర, జాన్, కత్తిరవి, శశి కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అంగన్‌వాడీల నిరసన హోరు

అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానన్న జగనన్న హామీ నీటిబుడగైంది. వారి బాధల్ని తొలగిస్తానన్న వాగ్దానం గాలిలో కలిసింది. జీతాలు చాలడం లేదు దయచూపమన్న వారి అభ్యర్థన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మనసు కరిగించలేకపోయింది. పని ఎక్కువవుతోంది.. ఒత్తిడి తగ్గించమన్న వారి వినతి ప్రభుత్వ పెద్దలకు పట్టనట్టుంది. వెరసి అంగన్‌వాడీ, సహాయకుల నిరవధిక సమ్మెకు దారి తీసింది. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు పోరు ఆగదనీ, హామీలు అమలుచేసే వరకు నిరసనలు హోరెత్తుతూనే ఉంటాయని నినదిస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరింది. అంగన్‌వాడీలు, సహాయకులు పోరును రోజురోజుకు ఉధృతం చేస్తున్నారు. ఉద్యమాన్ని ఆపాలని చూస్తున్న ప్రభుత్వానికి నిరసన సెగలు తగులుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను అధికారులతో పగలగొట్టించినా ఉద్యమాన్ని ఆపడంలేదు. తమ డిమాండ్ల సాధనకోసం రోజుకొక కొత్త రూపంలో సమ్మెను ముందుకు తీసుకుపోతున్నారు. కొద్దిపాటి జీతంతో బతికేదెలాగని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తాము కొత్త డిమాండ్లు చేయడంలేదనీ, ఎన్నికల ముందు జగనన్న ఏ హామీలైతే ఇచ్చారో వాటినే అమలు చేయమని కోరుతున్నామని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చెపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారివేతనాలు పెంచకపోగా, ఇస్తున్న గౌరవ వేతనాన్ని చూపి ప్రభుత్వ పథకాలకు దూరంపెట్టడం ఏమాత్రం సమర్థనీయంకాదు. అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలన్న ఆలోచన కలగకపోవడం విచారకరం. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల మొత్తం లక్షా ఆరువేల మంది ఈ నెల 12వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు లబ్ధిదారులు, తల్లుల నుంచి విశేష స్పందన వస్తోంది. ఎక్కడైనా ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేస్తే... సేవలు అందట్లేదని ప్రజలు వారిపై అసంతృప్తి వ్యక్తం చేయడం సాధారణం. కానీ ఆ ప్రజలే వారికి మద్దతుగా రోడ్డుపైకి వస్తే... ఆ ఉద్యోగుల డిమాండ్లలో న్యాయం ఉన్నట్టే కదా! రాష్ట్రంలోని జగన్ సర్కార్‌కి ఆ మాత్రం కూడా అర్థం అయినట్టు కనిపించడంలేదు. సమస్య పరిష్కారానికి చొరవ చూపడంలేదు. అధికారులు చర్చించినా గ్రాట్యుటీ, మెరుగైన వేతనం వంటి ప్రధాన అంశాలను దాటేయడంతో అంగన్‌వాడీలు సమ్మె సైరన్‌మోగించక తప్పలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు పడ్డాయి. వాటిని వెంటనే తెరవాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. కలెక్టర్ల ఆదేశాల మేరకు వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరుస్తున్నారు. దీనికి గ్రామాల్లో ప్రజల నుంచి ప్రతిఘటన వస్తోంది.

అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వంకన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానన్న ఎన్నికల వాగ్దానాల్ని నెరవేర్చాలనీ, పెరిగిన ధరలతో తమ కుటుంబాల పోషణ కష్టంగా మారిందనీ అందువల్ల కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలనీ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు నిధులు సక్రమంగా విడుదల చేయాలని గత రెండేళ్లుగా వివిధ రూపాలలో అంగన్‌వాడీలు ఘోషిస్తున్నా జగన్ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టైనా లేదు. సమస్యలపై చర్చించేందుకు వారిని పిలవకుండా ఏమాత్రం కనికరం లేకుండా వ్యవహరించారు. గత్యంతరం లేక వారు సమ్మెలోకి వెళితే, సమస్యల్ని పరిష్కరించే మార్గాలను వెతకాల్సిందిపోయి, బెదిరింపుల అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను పగలగొట్టించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. దీనికి నిరసనగా అనేక ప్రాంతాలలో లబ్ధిదారులు, స్థానికులు అంగన్‌వాడీ సిబ్బందికి మద్దతుగా నిలుస్తున్నారు. తల్లులు, వారి పిల్లలు రోడ్లపైకి వచ్చి మా టీచర్ మాకుకావాలంటూ ధర్నాలు చేస్తుంటే స్పందించాల్సిన ప్రభుత్వం మాత్రం తనకు తెలిసిన ఏకైక మార్గం నిర్బంధాలను అమలు చేస్తోంది. ఎప్పట్లా పోలీసుల్ని ప్రయోగించి కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతున్నది. గత ఐదురోజులుగా రాష్ట్రంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలవద్ద ఇదే తంతు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాల పగలగొట్టినప్పుడు పిల్లల తల్లిదండ్రులు అడ్డుకోవడానికి ప్రయత్నించి వారి ఉద్యమానికి మద్దతుగా నిలవడం అంటే ప్రభుత్వ తీరును ప్రజలు ఎండగట్టినట్టే. అంగన్‌వాడీల పోరాటానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో మద్దతు ప్రకటిస్తున్నాయి. వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికలలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి. గతంలో గుర్రాలతో తొక్కించుకుని, లాఠీదెబ్బలు తిని, అరెస్టులకు గురై వేతనాలు, హక్కులకోసం పోరాడిన అనేక సందర్భాలను ఈ సందర్భంగా గుర్తుచేస్తూ మీ వెంట మేమున్నామని అంగన్‌వాడీలకు భరోసా కల్పిస్తున్నాయి.

రాష్ట్రంలో ఐసీడీఎస్ పరిధిలో లక్షా 8వేల మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 40 లక్షలమంది తల్లులు, పిల్లలు, గర్భిణుల ప్రయోజనాలు పొందుతున్నారు. పని భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు నివారించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, చట్ట ప్రకారం సెలవులు, గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్‌వాడీ కార్మికసంఘాలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోగా పనిభారం విపరీతంగా పెంచివేసింది. యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నది. ఇప్పటికే ఉన్న యాప్‌లకు అదనంగా ఈ ఏడాది ఆగస్టు నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో మరో కొత్త యాప్‌ను తీసుకువచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు నాణ్యత లేనివి కావటం, గ్రామాలలో ఇంటర్‌నెట్ సౌకర్యం అంతంత మాత్రంగా ఉండటంతో అంగన్‌వాడీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా రూపొందించాలని కార్మిక సంఘాలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర స్థాయి అధికారులు కొందరు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి కొత్త కొత్త యాప్‌లను తీసుకు వస్తున్నారు. ఈ యాప్‌ల వలన అంగన్‌వాడీలతోపాటు గ్రామీణ వినియోగదార్లు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంతగా శ్రమపడి పనిచేసినా అధికారుల బెదిరింపులు తప్పడంలేదు. అత్యవసర పరిస్థితులలోనూ సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంగన్‌వాడీలు వాపోతున్నారు. "మాకు బదులుగా సచివాలయ సిబ్బందితో పనిచేయిస్తామంటున్నారు. మరి మా సంగతేంటి? పనిచేయని మొబైల్ ఫోన్లు ఇచ్చారు. తెలంగాణ కంటే వెయ్యి అదనంగా జీతం ఇస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్ రెడ్డి పట్టించుకోవట్లేదు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నాం. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె చేస్తాం" అని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. వారి వాదన కూడా న్యాయ సమ్మతమే. ప్రధానాంశాలను విస్మరించి ప్రాధాన్యతలేని అంశాలపై చర్చలు జరిపి సమ్మెను విరమించుకోమనడం విచారకరం. అటువంటి ధోరణితో సమ్మె పరిష్కారంకాదు. వీరి సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని కార్మికుల వేతనాలను పెంచి సమస్యలను పరిష్కరించడం ద్వారా ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేరుస్తారని ఆశిద్దాం.

మంత్రి గారి గది

చింతపట్ల సుదర్శన్

పొద్దు కప్‌బోర్డులో పడేటప్పటికి పక్షులూ మనుషులే కాదు డాగీలు, డాంకీలు కూడా కొంపకో కొంప అనుకునే చోటుకో చేరుకోవల్సిందే కద. డాగీ, డాంకీ అరుగుమీదకు వచ్చేప్పటికి కూలిన ఇంటి లోపల మనుషుల అలికిడి వినిపించింది. డాగీ ఓ మొండి గోడపక్కన, డాంకీ ఓ విరిగిన స్తంభం వెనుక దాక్కుని ఎవరా అని గమనించేయి. ఇద్దరు మనుషులున్నారు లోపలి సగం గదిలో. ఒకడు బొద్దుగా ఉన్నాడు కానీ ముద్దుగా లేడు. మరొకడు బొద్దుగా లేడు కాని, ముక్కూ ముఖం చూడముచ్చటగా ఉన్నాడు. ఒక దన్నాడు ఈ పాత కొంప మన హర్రర్ సినిమాకు సరిగ్గా సరిపోతుంది. మరొకడు అవునన్నట్టు తల ఊపుతూ మన 'మంత్రిగారి గది' సినిమాలో దెయ్యాలు ఫ్రీగా తిరగడానికి ఈ దయ్యాల కొంప భలే సూటవుతుంది గానీ అన్నా మన సినిమాకి, మంత్రి గారిగది అని పేరెందుకు పెట్టారన్నా అన్నాడు. ఇంతకు ముందే రాజుగారి గది అని సిన్మా వచ్చింది కదరా అందుకే మంత్రిగారి గది అని పెట్టుంటారు. అయినా మంత్రిగారి గది ఇలా వుంటుందా ప్యాలెస్‌ల్లో కదరా మంత్రులుండేది అని నవ్వాడు బొద్దుగా ఉన్నోడు. నవ్వినప్పుడు వాడి పండ్ల సెట్లో ముందువి మూడు కనిపించేయి ఖాళీగా. వాళ్లు ప్యాలెసుల్లో ఉన్నా ప్రజల్ని దయ్యాల్లా వేపుకు తింటార్లేరా. ఏ పేరయితే మనకేంకాని లోకేషన్ బాగుందని చెప్తాం పద అన్నాడు బొద్దుగా లేనోడు.

ఇద్దరూ బయటకి వచ్చారు. బొద్దుగా ఉన్నోడు మెట్లు దిగుతుంటే, హఠాత్తుగా డాగీ వచ్చి బాగా బలిసున్న వాడి పిక్క పట్టుకు పీకింది. 'చచ్చాన్రో' అంటూ కింది కురికి లబలబలాడాడు. అంత బొద్దుగా ఉన్నాడు కూడా కుర్ర పీసుగులా.. అంతకు ముందే మెట్లు దిగినవాడు వెనక్కు పరుగెత్తుకు వచ్చాడు. ఎక్కడ్నించి వచ్చిందిరా ఈ కుక్క అరవని కుక్క కరుస్తుందన్న మాట నిజం చేసింది అంటూ లావాటి వాడ్ని జబ్బపుచ్చుకు నడిపించాడు కారు దగ్గరికి. ఏంటి డాగీ నువ్వు చేసిన పాడుపని అని విసుక్కుంది డాంకీ - మంచి పనిచేశాను. ఎన్నాళ్లకు దొరికిందో పిక్క అంటూ నోట్లో ఇరుక్కున్న ప్యాంటు తాలూకు దారాలను నాలుకతో పీకసాగింది డాగీ. నీ చిరకాలవాంఛ తీర్చుకోడానికేనా ఆ బోండాం గాడిని కరిచావు అంది డాంకీ- అదెలాగూ తీరిందనుకో. కానీ సినిమా అంటున్నారు కదా. ఆళ్ల గుంపు వచ్చిక్కడ సినిమా తీస్తే మన 'షెల్టర్' ఏమవుతుంది. పైగా దయ్యాలంటున్నారు. వీళ్ల హడావిడి చూసి నిజం దయ్యాలిక్కడికొచ్చి సెటిలైతే మన పరిస్థితేమిటి? అందుకే 'ఫ్యూచర్'ను దృష్టిలో పెట్టుకుని వాడికి 'షాక్' ఇచ్చా. ఇక 'మంత్రిగారి గది' సినిమా ఇక్కడ షూట్ చెయ్యరు. సినిమావాళ్లకు సెంటిమెంట్లెక్కువ కదా అని చప్పుడు రాకుండా నవ్వింది డాగీ. ఏమిటో 'డిస్కషన్ ' అంటూ అరుగు ఎక్కాడు తెలుగు అబ్బాయి. మంత్రిగారి గదికోసం వచ్చిన వాడి పిక్క కొరికింది డాగీ దాని మీదే అంది డాంకీ. అవునా పిక్క దొరికిందా 'కంగ్రాట్యు లేషన్స్' డాగీ అన్నాడబ్బాయి. నీకూ చెప్పాలి కంగ్రాట్స్ లక్షల్లో ఉద్యోగాలంట కదా.. ఈ సారి నీ 'బ్రెడ్డు విరిగి హనీ'లో పడ్డట్టే అంది డాగీ. అదేం లేదు. ప్రతి ఎలక్షన్‌కీ మన లీడర్లు జనాన్ని చిన్న పిల్లల్నిచేసి గిలక్కాయ చూపించి 'జో' కొడ్తారంతే అన్నాడబ్బాయి. అవును ఎన్నికలొచ్చినప్పుడల్లా 'పులి బంగారు కంకణం' కథ గుర్తొస్తుంది నాకు అంది డాంకీ. నాకైతే జపం చేసే కొంగ కథ, వ్రతంచేసే పిల్లికథ గుర్తుకొస్తయి అంది డాగీ. ఎన్నికలొచ్చినప్పుడల్లా గోడమీద పిల్లుల గుంపే కనిపిస్తుంది నాకు. ఇదే కదా మనల్ని ఏలేవారు గోడలు దూకే శుభసమయం అన్నాడు అబ్బాయి. శుభసమయమే మరి ప్రతి ఐదేళ్లకు ఒకసారయినా వరాలజల్లు కురిపిస్తారు కదా ఒకటో, అరో నిజంకాక పోవుకదా అంది డాగీ. ఇప్పటికిప్పుడు అందరి కష్టాలూ గుర్తుకొస్తయి 'బుగ్గ' కారోళ్లకి. దానకర్ణులైపోతారు. నిన్నిటిదాకా ఇసుకా, మట్టీ అమ్ముకున్నోళ్లు రియల్ దందాలు చేసినోళ్లు, భూములు నొక్కేసి బంగ్లాలు కట్టినోళ్లు అన్నాడబ్బాయి. మన కష్టాల సంగతి పక్కన పెట్టు మళ్లీ సీట్లు గెల్చుకునే కష్టాలు వాళ్లకు మొదలైతాయికదా అంది డాంకీ. సీట్లు గెలవాలంటే టిక్కెట్లు రావాలి కదా. ఒక్కసారి రక్తం రుచిచూసిన పులిని 'మ్యాన్‌ఈటర్ 'అంటారు. మరి వీళ్లనేమనాలో. ఐదేళ్లు అందినకాడికి దోచేశాం, సామాన్యుడి నోట్లో మట్టికొట్టేశాం ఇక మరొకళ్లకి ఛాన్సు ఇచ్చేద్దాం అనుకోరు అసలు రాజ్యాంగంలో అలాగ రాసిఉంటే బాగుండేది. 'దండుపాళ్యం' దండుమారేది అన్నాడబ్బాయి. 'సిట్టింగోళ్లే' మళ్లీ మళ్లీ సిట్టింగవుతామంటారు. ఒక్కసారి కూచున్నాక దిగచ్చా అంది డాగీ. సిట్టింగ్ వాళ్లల్లో ముప్పాతిక మందికి టిక్కెట్లు ఇవ్వరంట ఎందుకోమరి అంది డాంకీ. దీన్నిబట్టి తెలుస్తున్నది కదా గెలిచిన వాళ్లు చేసిన నిర్వాకం ఏమిటో. వాళ్ల మూటలు వాళ్లు కట్టేసుకుని ప్రజల్ని పట్టించుకున్నపాపాన పోలేదని అర్థం అవుతున్నది కదా. మళ్లీ ఓటడిగితే వాయగొడ్తారనే కదా అన్నాడబ్బాయి. సిట్టింగులకు టిక్కెట్లు రాకపోతే తిరుగు బాటు చెయ్యరూ కొందరు పార్టీ మారుస్తారు. కొందరు శాపనార్థాలు పెడ్తారు పార్టీ కుప్పకూలాలని, ఓ యమ్మ జబర్దస్త్‌లో చేరిపోతే ఓ అయ్య మళ్లీ పాత దందా మొదలుపెడ్తాడు అన్నాడబ్బాయి. మన కొంపలో ఏక్టింగ్ దయ్యాలతో సినిమా తీయాలను కున్నారు ఆదొబ్బోడూ, బక్కోడూ కానీ అసలు మంత్రి గారి గదిలో షూటింగ్ చూసి తీరాలసలు. ఎవడ్ని పీకుతాడో ఎవడ్ని గోకుతాడో ఎవరి కెరుక అన్నది డాంకీ గోడకు ఆనుకుని కళ్ళుమూసుకుంటూ. అసలు కథా, సీన్లు అన్నీ చూడటానికి సిద్ధమవ్వాలి మనం. క్లైమాక్స్ మాత్రం ప్రజలు చూపుడు వేలుమీద వేయించుకునే గుర్తే నిర్ణయిస్తుంది వస్తానంటూ అరుగుదిగాడు అబ్బాయి ! ఎవరికి టికెట్లు వస్తాయో రావో మనకెందుకు ఆగోల, నాకు మాత్రం పిక్క కొరికే కోరిక తీరింది అని ఓసారి కళ్లు తెరిచి మూసుకుంది డాగీ.

కేంద్ర ప్రభుత్వ కబంధహస్తాల్లో ఎన్నికల కమిషన్

నీరుకొండ ప్రసాద్

ఎన్నికల కమిషనర్ల నియామకంలో మరింత పారదర్శకత కోసం సుప్రీంకోర్టులో మాదిరిగా కొలీజియం విధానాన్ని అవలంబించాలంటూ దాఖలైన పిటీషన్లపై ఆ మధ్య సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆయన లేకపోతే సభలో ఎక్కువ సభ్యులు గల పార్టీ నాయకుడు సెలెక్ట్ ప్యానెల్‌లో సీజేఐకి చోటు కల్పించాలని కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకొని కేంద్రం ఆమోదింపజేసుకుంది కేంద్ర ప్రభుత్వం. విపక్షాలు, మాజీ కమిషనర్లు అభ్యంతరం చెప్పినా వెనక్కి తగ్గలేదు. సీజేఐ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం చూపిన చొరవను నీరు కార్చారు. ప్రజాస్వామ్యానికి మూలస్థంభం అయిన రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి కీలక పీఠాలపై కీలుబొమ్మలను కూర్చోబెడుతున్న ఉదంతాలు పెరిగిపోతున్న తరుణంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తూట్లు పొడిచారు. అన్ని రాజ్యాంగ బద్ధమైన సంస్థలను తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కేంద్రప్రభుత్వం ఒక పథకం ప్రకారం వ్యవహరిస్తోంది. ఈ బిల్లు ప్రకారం సీఈసీ, ఈసీల నియామకానికి ప్రధాని సహా ముగ్గురు సభ్యులతో ఎంపిక కమిటీని ఏర్పాటు చెయ్యనున్నారు. కమిటీ ఛైర్మన్‌గా ప్రధాని వ్యవహరించనున్నారు. ఈ నిర్ణయంతో ఎన్నికల కమిషన్ కేంద్రప్రభుత్వానికి అనుబంధ సంస్థగా మారే ప్రమాదం లేకపోలేదు.

పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల నిర్వహణకు అవసరమైన పర్యవేక్షణ, నియంత్రణ వంటి కర్తవ్యాలను ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని 324వ అధికరణ కింద రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సి వుంది. ఎన్నికల కమిషన్ రాజీపడితే మొత్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. కేంద్రప్రభుత్వ కబంధ హస్తాల నుంచి ఎన్నికల సంఘానికి స్వేచ్ఛ కల్పించడం అత్యవసరం. అందుకు మొదట ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రప్రభుత్వానికి విశేషాధికారం ఉండకూడదు. ఎన్నికల కమిషన్‌కు స్వతంత్రత, నిష్పాక్షికత ఉండాలని, అందుకే సీజేఐకి కూడా చోటు కల్పించాలని సుప్రీంకోర్టు విస్పష్టంగా తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్రం ప్రభుత్వం సంకుచితంగా వ్యవహరించి బిల్లును తెచ్చి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును తుంగలో తొక్కింది. నిష్పక్షపాత కమిటీకి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇస్తే కేంద్రం పక్షపాతంతో వ్యవహరించి ఈ బిల్లును ఆమోదింప చేసుకున్నది. ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలంటే స్వతంత్ర ఎన్నికల వ్యవస్థ తప్పని సరి



అని జస్టిస్ కెఎం జోసెఫ్ నేతృత్వంలోని సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. నిష్పాక్షికంగా, సర్వ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అత్యంత కీలక పీఠం పై కీలు గుర్రాలను నియమిస్తే మనం నిర్మించుకున్న ప్రజాస్వామ్య మనుగడ ఏమి కావాలి? స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం ప్రతిష్ఠ తిరిగి నిలబడాలి అంటే సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విధంగా న్యాయబద్ధంగా, పారదర్శక పద్ధతిలో ఎన్నికల కమిషన్ల నియామకం జరగాలి. కానీ కేంద్ర ప్రభుత్వం కమిషనర్ల నియామకంలో సీజేఐకి చోటు లేకుండా, సీజేఐ స్థానంలో కేబినెట్ మంత్రికి చోటు కల్పించడం దుర్మార్గం.

గత కొంత కాలంగా ఎన్నికల కమిషనర్ల నియామకమే లోపభూయిష్టంగా మారింది. ఈసీల నియామకం వివాదం కాకుండా ప్రత్యేక యంత్రాంగం వుండాలన్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయం నెరవేరక దొడ్డిదారి నియామకాలు జరుగుతున్నాయి. రాజకీయాలు రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించే స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే వ్యక్తులు ఎన్నికల కమిషనర్ కావాలి. ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా గల కమిటీ ఎన్నికల కమిషనర్లను ఎంపిక చెయ్యాలని ఎన్నో ఏళ్ల క్రితమే లా కమిషన్ కూడా సిఫార్సు చేసింది. ఈసీల నియామక విధానాన్ని నిష్పాక్షికంగా నిర్వహించాలని ఈసీ పదవుల భర్తీలలో విపక్షాలకు భాగస్వామ్యం కల్పించాలని 2012లో బీజేపీ అగ్రనేత ఎల్ కె అద్వానీ అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. మూడింట రెండొంతుల మెజారిటీతో పార్లమెంట్ ఆమోదించిన వ్యక్తులనే కమిషనర్లుగా నియమించాలని సభ సభ్యులు ఆచార్య సక్సేనా సూచించారు. ఎన్నికల కమిషన్ వ్యవస్థీకృత మార్పులు అనివార్యమని సామాజిక వేత్తలు, మేధావులు అభిప్రాయపడ్డారు. నీతిమంతమైన పాలనకు బాటలు వెయ్యాల్సిన ఎన్నికల వ్యవస్థ మన దేశంలో భ్రష్టుపట్టి పోవడం బాధాకరం.

మన భారత దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు 20 వరకు వున్నాయి. వాటిలో ప్రధానమైనది ఎన్నికల కమిషన్. దీనికి ప్రజాస్వామ్య వ్యవస్థని కంటికి రెప్పలా సర్వ స్వతంత్రంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించే బలమైన అధికారం వుంది. కానీ ఎన్నికల సంఘం ప్రవర్తన పై దేశంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అన్ని పక్షాలను సమానంగా చూడాల్సిన ఎన్నికల సంఘం అధికార పక్షాన్ని ఒక విధంగా, ప్రతిపక్షాలను మరొక విధంగా చూస్తోంది. నేడు ఎన్నికల సంఘాలు కీలు గుర్రాలుగా మారి అధికారంలో వున్న పార్టీలకు అడుగులకు మడుగులొత్తుతూ రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను తాకట్టు పెడుతున్నారు. అన్ని రాజకీయ పక్షాలను సమానంగా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత.

కానీ అధికారంలో వున్న వారికి అనుకూలంగా వ్యవహరించేటట్లు అయితే ఇక ఎన్నికలు ఎందుకు? సమాజ శ్రేయస్సును, దేశాభివృద్ధిని కాంక్షించే వారికి స్వతంత్రత, స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థే భరోసాగా నిలుస్తుంది. ప్రజాతంత్ర వ్యవస్థ ధ్వంసం అవుతుందని అందుకు ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి అని మాజీ ఎన్నికల కమిషనర్ టీఎన్‌శేషన్ ఎప్పుడో చెప్పారు. శేషన్ పదవీకాలంలో రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను వణికించారు. ఎన్నికలను న్యాయబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఆయన కృషి చేశారు.

ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థ కానే కాదని ప్రజలకు మొదటిసారి తెలియచెప్పిన వ్యక్తి టి ఎన్ శేషన్. ఎన్నికల ప్రక్రియను పరిహసిస్తున్న అనేక అన్యాయాలకు, అక్రమాలకు తన జమానాలో అడ్డుకట్ట వేశారు.

ప్రజాస్వామ్య దేశాలు రాజ్యాంగ వ్యవస్థలు బలోపేతమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు పటిష్ట సంస్కరణలు చేపడుతున్నాయి. కానీ మన దేశంలోసంకుచిత రాజకీయంతో ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. ఏది ఏమైనా కేంద్రప్రభుత్వ కబంధ హస్తాల నుండి ఎన్నికల కమిషన్‌కి విముక్తి కలిగించినప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షణ జరుగుతుంది.

ఫోన్: 849625610

మత విద్వేషాలపై కళాకారుల పాదయాత్ర

చంద్రా నాయక్

ప్రజల మధ్య స్నేహం, శాంతి, స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం, సౌభ్రాతృత్వం, మానవ వికాసం, మనుషుల మధ్య సోదర భావం పెంపునకు, మూఢాచారాలు మత విద్వేషాలు మధ్య రోజు రోజుకు మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాలను రూపుమాపాలని ప్రకృతి పర్యావరణం, పరిరక్షణకోసం పునరంకితం కావాలంటూ ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) దేశవ్యాపిత పాదయాత్రలను చేపడుతోంది. భావసారుప్యత కలిగిన ఆరు పార్టీలు ఈ పాదయాత్రలలో భాగస్వామ్యం అవుతున్నాయి. అభ్యుదయ రచయితల సంఘం, జన్‌వాది లేఖక్ సంఘ్ జన్ సాంస్కృతిక మంచ్, దళిత లేకక్ సంఘ్ జననాట్యమంచ్ తదితర సంఘాలు ఈ పాదయాత్రలో పాల్గొంటున్నాయి.

అనేక రాష్ట్రాలలో కవులు, కళాకారులు, దేశభక్తులు, ప్రకృతి పరిరక్షకులను ఏకంచేసి పాదయాత్రలు నిర్వహించాలని సంకల్పించింది. దీనికి జాతీయస్థాయిలో "ఢై ఆకర్ ప్రేమ్ యాత్ర" ను "కల్చరల్ మార్చ్" గా నామకరణ చేశారు. ఈ ఏడాది మార్చిలో ఝార్ఖండ్ రాష్ట్రంలోని డెల్టాన్‌గంజిలో జరిగిన ఇప్టా 15వ జాతీయ మహాసభల్లో అనేక విషయాలు చర్చించి దేశం కోసం, మానవ అభివృద్ధి కోసం, ప్రకృతి పరిరక్షణకోసం సుదీర్ఘకాలం దేశంలో కవులు, కళాకారులు పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. దేశం కోసం, ప్రజా చైతన్యంకోసం అలుపెరుగని పోరాటంచేసే సాంస్కృతిక సంఘం ఇప్టా. దేశ స్వాతంత్ర్య సంగ్రామం కోసం ప్రజల పక్షాన నిలబడింది. అదే సమయంలో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఫాసిజానికి వ్యతిరేకంగా యుద్ధం వద్దు, శాంతి ముద్దు అంటూ అనేక కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజలను జాగృతం చేసింది. నేడూ ప్రజా చైతన్యం కోసం ముందుకు సాగుతున్న సాంస్కృతిక సంఘం అఖిలభారత ప్రజానాట్యమండలి. దేశ ముద్దుబిడ్డ బ్రిటిష్ మూకలను గడగడలాడించిన సర్దార్ భగత్ సింగ్ జయంతి సెప్టెంబర్ 27, నాడు రాజస్థాన్ రాష్ట్రం అల్వార్‌లో ప్రారంభించి అనేక రాష్ట్రాల్లో పాదయాత్రలు నిర్వహించుకుంటూ వివిధ అంశాల ప్రచార నిమిత్తం దేశంలో ప్రజలను కలుసుకుంటూ కవులు, కళాకారులు, దేశభక్తులు, పర్యావరణ పరిరక్షకులు, మానవ ప్రేమికులు పాదయాత్ర చేపట్టారు. యువకులు, విద్యార్థులు, మహిళలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని కళారూపాలు, పాటలు ప్రదర్శించాలని, చివరిగా గాంధీ వర్ధంతి జనవరి 30 నాటికి ఢిల్లీలో ఈ కార్యక్రమం ముగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కళాకారులు, సాహిత్యవేత్తలు, రచయితలు, పౌర సమాజం, గ్రామీణ, జానపద కళాకారులు భావసారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలు, సాంస్కృతిక సాహిత్య సంఘాలు అందరూ కలిసి దేశ వ్యాప్తంగా వారి వారి రాష్ట్రాలలో, ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. రోజుకు 10 నుంచి 12 కిలోమీటర్ల వరకు పాదయాత్ర నిర్వహిస్తూ ప్రజల మధ్య శాంతి, ప్రేమ, దయ, కరుణ, మంచితనం, మానవత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం రైతులు, రైతు కూలీలు శ్రామికులు, కార్మికులు వారి అంశాలను ఇతివృతంగా తీసుకొని కళారూపాలు ప్రదర్శిస్తూ అందులో వారిని కూడా భాగస్వామ్యం చేస్తూ విద్వేషం, కపటత్వం, మూఢవిశ్వాసాలు, ప్రకృతి విధ్వంసం, కుల, మత, ప్రాంత, లింగ వివక్షతను రూపుమాపి గొడవలు, ఘర్షణలు, యుద్ధాలు లేకుండా మత దురహంకారం వద్దంటూ ప్రధానమైన అంశాలను తమ కళారూపాలు, ఆటపాటల ద్వారా ప్రజలను మేల్కొల్పడానికి ఈ పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. దాదాపు 121 రోజులపాటు వివిధ రాష్ట్రాలలో పాదయాత్రలు నిర్వహించడానికి సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే రాజస్థాన్‌లో ప్రారంభమైన పాదయాత్ర పది రాష్ట్రాలలో పూర్తి చేసుకుంది. సమాజం కోసం, సమాజ ఉద్ధరణ కోసం, సంఘ సంస్కర్తలుగా, చరిత్రకారులుగా ఉన్న అనేకమంది త్యాగాలను, కీర్తిని గుర్తుచేసుకుంటూ ప్రజలకు వారి త్యాగాలను తెలియపరుస్తూ ఈ పాదయాత్ర కొనసాగుతోంది. సంఘ సంస్కర్తలు కబీర్, జ్యోతిబాపూలే, వివేకానంద, వేమన తదితరులతో మొదలుకొని మహాత్మా గాంధీ, సర్దార్ భగత్ సింగ్, అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్ తదితర జాతీయస్థాయి నాయకులతోపాటు తెలుగు రాష్ట్రాలలో సమాజ చైతన్యానికి అకుంఠిత దీక్షతో పనిచేసిన కందుకూరి వీరేశలింగం,



గురజాడ అప్పారావు, అల్లూరి సీతారామరాజు, జాషువా, మఖ్దూం మొహియొద్దీన్, సుద్దాల హనుమంతు, గరికపాటి రాజారావు లాంటి అనేకమంది త్యాగాలను, స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ వారి వారి చారిత్రక ప్రదేశాలకు, స్మారక కేంద్రాలకు వెళ్లి స్మరించుకోవాలని నిర్ణయించారు. మహనీయుల వర్ధంతులు, జయంతులను వారి జీవితాలను స్మరణకు తెచ్చే విధంగా ప్రజలకు తెలియపరచటం పాదయాత్ర ప్రధాన ఉద్దేశం.

దేశంలో, సమాజంలో ప్రజలమధ్య ద్వేష భావం, అసమానత్వం, అరాచకత్వం, అప్రజాస్వామికం, నియంతృత్వం, ఫాసిజపు ఆనవాళ్లు సమాజంలో కనపడినప్పుడల్లా ఎంతోమంది సంఘసంస్కర్తలు, సామాజిక, సాంస్కృతిక సంఘాలు, కార్యకర్తలు ప్రజలను చైతన్య పరచటానికి పూనుకోవడం మనకు తెలిసిందే. నేడు దేశంలో నియంతృత్వ ఫాసిజపు అప్రజాస్వామికమైన యుద్ధ వాతావరణం, మతమౌఢ్యం, అసమానత్వం, మతాల మధ్య ఘర్షణ పెరిగిపోతున్న నేపథ్యంలో కవులు, కళాకారులు, రచయితలు, పౌర సమాజం ప్రజలను జాగృతం చేయాలని సంకల్పించారు. భావ ప్రకటన స్వేచ్ఛకు తావులేకుండా, ప్రశ్నించే వ్యక్తులను సంస్థలను దాడులకు గురిచేస్తూ గొంతు నులిమే చర్యలకు పాలకులు పూనుకుంటున్నారు. భిన్న సంస్కృతి, సాంప్రదాయాలు కలిగిన దేశంలో ఆహారపు అలవాట్లు, వేషధారణ, భావ ప్రకటన నియంత్రణలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు అసహనానికి, ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను జాగృతం చేయడానికి అనేక రూపాల్లో యాత్రలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలు అన్ని రకాలుగా విధ్వంసానికి గురవుతున్నాయి. మూఢవిశ్వాసాలను పాలకులే ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభం మూలంగా కోట్లాదిమంది ప్రజలకు ఆహార భద్రత ముప్పు పొంచి ఉంది. ఇంతటి విపత్కరమైన పరిస్థితుల్లో ప్రజలను చైతన్య పరచటానికి కళాకారులు దీర్ఘకాలంపాటు రాష్ట్రాలవారీగా పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువకావడం అభినంచదగ్గ విషయం. ఇప్టా సమాజం కోసం, దేశం కోసం, మానవాభివృద్ధి కోసం కృషిచేసిన స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల అడుగుజాడల్లో నడుస్తూ జన జాగృతికోసం ఈ పాదయాత్రలు చేపట్టింది.

ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాదయాత్ర చేపట్టేందుకు కవులు, కళాకారులు సన్నద్ధమయ్యారు. ఇప్టా జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకత్వం నిర్వహణలో జరుగుతున్న ఈ పాదయాత్రలో సాహిత్య, సాంస్కృతిక వ్యక్తులను, సంస్థలను కలుపుకొని ఈ నెల 19, 20 తేదీలలో గుంటూరు-విజయవాడ మధ్య సుమారు 40 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నిర్ణయించింది. సమాజ హితంకోరే ప్రకృతి పరిరక్షణ లక్ష్యంగా పనిచేసే ప్రతి ఒక్క సంస్థలు, వ్యక్తులు ఇందులో భాగస్వామ్యులు కావాల్సిన అవశ్యకత చాలావుంది.

భద్రతా వైఫల్యంపై నోరు మెదపరేం

- భద్రతా ఉల్లంఘన అంశంపై గందరగోళం
- హోం మంత్రి షా రాజీనామా చేయాలని డిమాండ్
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ విపక్ష సభ్యుల నిరసన
- దద్దరిల్లిన పార్లమెంటు

న్యూఢిల్లీ: పార్లమెంటు భద్రతా ఉల్లంఘన అంశంపై విపక్ష సభ్యుల నిరసనల నడుమ ఉభయ సభలూ సోమవారం వాయిదా పడ్డాయి. డిసెంబరు 13న సభలో భద్రతా ఉల్లంఘనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని లోక్‌సభ, రాజ్యసభలో విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో గందరగోళం నెలకొంది. లోక్‌సభ సోమవారం అనేక సార్లు వాయిదా పడింది. పోస్టాఫీసు బిల్లు ఆమోదం పొందిన వెంటనే పార్లమెంటు దిగువ సభ నాల్గవసారి మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా పడింది. అంతకుముందు బిల్లుపై చర్చ ముగిసిన తర్వాత సభ మధ్యాహ్నం 2:45 గంటలకు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు ప్రారంభమైన చర్చలో వైసీపీకి చెందిన బి.వి. సత్యవతి, బీజేపీకి చెందిన భోలా సింగ్, శివసేనకు చెందిన ప్రతాప్‌రావు జాదవ్, బీఎస్పీ ఎంపీ రామ్ శిరోమణి వర్మ పాల్గొన్నారు. చర్చకు సమాచార శాఖ సహాయ మంత్రి దేవ్ సిన్హ చౌహాన్ సమాధానమిచ్చారు. విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేయడంలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న బీజేపీ సభ్యుడు రాజేంద్ర అగర్వాల్ సభను మధ్యాహ్నం 2:45 గంటలకు వాయిదా వేశారు. అంతకుముందు, మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు సభా కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తున్న అగర్వాల్ టేబుల్‌పై ఉంచడానికి కాగితాలను తీసుకున్నారు. గందరగోళం నడుమ కమ్యూనికేషన్ల మంత్రి అశ్విని వైష్ణవ్ టెలికమ్యూనికేషన్స్ బిల్లు-2023ను ప్రవేశపెట్టినప్పుడు అగర్వాల్ ప్రతిపక్ష సభ్యులను తమ సీట్లకు తిరిగి వెళ్లాలని, అధ్యక్ష స్థానానికి ప్లకార్డులు చూపించవద్దని కోరారు. 'మీపై చర్య తీసుకునేలా అధ్యక్ష స్థానాన్ని బలవంతం చేయవద్దు' అని నిరసన చేస్తున్న సభ్యులతో అగర్వాల్ అన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఇదిలాఉండగా, ఉదయం లోక్‌సభ సమావేశమైనప్పుడు సభ్యులు శనివారం మరణించిన కువైట్ ఎమిర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్ సబాకు నివాళులర్పించారు. డిసెంబరు 13న జరిగిన భద్రతా ఉల్లంఘన ఘటన తర్వాత లోక్‌సభ తీసుకున్న చర్యల గురించి స్పీకర్ ఓం బిర్లా సభకు వివరించారు. సభను సజావుగా నడిపేందుకు సభ్యులందరి సహకారం కోరారు. అయితే, విపక్ష సభ్యులు హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొందరు విపక్ష ఎంపీలు తమ డిమాండ్లు రాసి ఉన్న ప్లకార్డులను కూడా ప్రదర్శించారు. లోక్‌సభలోకి ప్లకార్డులు తీసుకురావడం సభ గౌరవాన్ని దిగజార్చిందని బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా ప్లకార్డులు ప్రదర్శించవద్దని ప్రతిపక్ష ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. విపక్ష ఎంపీలు బిర్లాతో పాటు జోషి విజ్ఞప్తిని పట్టించుకోకుండా తమ నిరసనలను కొనసాగించడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాజ్యసభలోనూ అవే డిమాండ్లు

పార్లమెంటు భద్రత ఉల్లంఘనపై విపక్షాల గందరగోళం మధ్య సభలో పుదుచ్చేరి, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులు మూజువాణి ఓటుతో ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభ సోమవారం సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లును గత వారం లోక్‌సభ ఆమోదించింది. డిసెంబరు 13న సభలో భద్రతా ఉల్లంఘనలపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్న విపక్ష సభ్యుల నిరంతర నినాదాల మధ్య ఈ బిల్లులను ఎగువ సభ ఆమోదించింది. తరువాత, ఛైర్మన్ జగదీప్ ధన్కర్ మాట్లాడుతూ భద్రతా ఉల్లంఘన 'సమష్టి ఆందోళన' విషయమని అన్నారు. 'ఇలాంటి సంఘటనలు గతంలో కూడా జరిగాయి. అత్యంత అనుకూలమైన వాతావరణంలో పనిచేసేలా చూసుకోవడం సమష్టి బాధ్యత' అని తెలిపారు. 'ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి, అలాంటి సంఘటనలు జరగకుండా పక్కా కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఉన్నత స్థాయి విచారణ కమిటీని స్పీకర్ లోక్‌సభ ఇప్పటికే ఏర్పాటు చేశారు. దాని ఫలితాలు నిర్ణీత సమయంలో సభతో వెల్లడిస్తాం' అని ఛైర్మన్ చెప్పారు. అయితే గందరగోళం కొనసాగుతుండగా ఛైర్మన్ సభను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేశారు. కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన 20 నిమిషాలకే ఆమోదం పొందాయి. సభ్యులందరూ 'మహిళల హక్కుల అనుకూలమైన' బిల్లులకు మద్దతు ఇవ్వాలని రాయ్ కోరారు. బిల్లులపై సభ్యులు క్లుప్తంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కొందరు సభ్యులు కోరారు.

లోక్‌సభలో భద్రతా వైఫల్యం... ఆరు రాష్ట్రాలకు దర్యాప్తు బృందాలు

న్యూఢిల్లీ: లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై దర్యాప్తులో భాగంగా దిల్లీ పోలీసు ప్రత్యేక విభాగానికి చెందిన బృందాలు ఆరు రాష్ట్రాలకు వెళ్లాయి. రాజస్థాన్, హరియాణా, కర్నాటక, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో వేట ప్రారంభించాయి. ఆ బృందాలు నిందితులను కూడా వెంట తీసుకెళ్లాయి. అంతేగాకుండా మరో 50 బృందాలు దర్యాప్తులో తలమునకలయ్యాయి. నిందితుల బ్యాంకు ఖాతాల వివరాలు, పూర్వాపరాలను సేకరిస్తున్నాయి. పార్లమెంటులో అలజడి సృష్టించిన ఘటనకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న లలిత్ ఝా ధ్వంసం చేసిన ఆధారాలను పోలీసులు కనుగొన్నారు. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఫోన్లను అతడు దహనం చేసినట్లు గుర్తించారు. కాలిపోయిన ఫోన్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గతవారం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో విజిటర్స్ గ్యాలరీలో కూర్చున్న సాగర్ శర్మ, మనోరంజన్ లోక్‌సభలో అలజడి సృష్టించారు. అదే సమయంలో అమోల్ శిందే, నీలమ్ పార్లమెంట్ వెలుపల ఆందోళన చేపట్టారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం శీతాకాల సమావేశాలు కొనసాగుతుండటంతో పార్లమెంట్ ప్రాంగణంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ అలజడి వెనక కుట్ర త్వరలోనే బయటపడుతుందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ చెప్పుకొచ్చారు.

నిందితుల సామాజిక మాధ్యమ వివరాలివ్వండి

పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కేసులో మెటాకు పోలీసుల లేఖ

న్యూఢిల్లీ: పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కేసులో అరెస్టయిన ఆరుగురు నిందితుల సామాజిక మాధ్యమ ఖాతాలు, అలాగే ఇప్పుడు తొలగించబడిన ఫేస్‌బుక్ పేజీ 'భగత్ సింగ్ ఫ్యాన్ క్లబ్' వివరాలను తిరిగి పొందేందుకు దిల్లీ పోలీసులు మెటాకు లేఖ రాశారు. డిసెంబరు 13న జరిగిన ఘటనను అమలు చేసినందుకు గాను ఎవరైనా నిందితుల నుంచి డబ్బు అందుకున్నారో లేదో తెలుసుకోవడానికి నిందితులందరి బ్యాంకు ఖాతా వివరాలను కూడా పోలీసులు సేకరించినట్లు పోలీసు వర్గాలు సోమవారం తెలిపాయి. పోలీసులకు చెందిన వివిధ బృందాలు ఆదివారం నిందితుల కుటుంబ సభ్యులను సంప్రదించి వారి బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించాయి. హరియాణాలోని జింద్‌లోని నీలం దేవి, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో సాగర్ శర్మ నివాసాల నుంచి వారి బ్యాంక్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించాయి. దిల్లీ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ యాజమాన్యంలోని మెటాకు నిందితుల సోషల్ మీడియా ఖాతాల వివరాలు అందించాలని లేఖ రాసింది. అలాగే నిందితులు ఒకరినొకరు పరిచయం చేసుకున్న ఫేస్‌బుక్ పేజీ 'భగత్ సింగ్ ఫ్యాన్ పేజీ' వివరాలను కోరింది. ఆ పేజీని నిందితులు ప్రారంభించి ఆ తర్వాత తొలగించారు. నిందితులు మొబైల్ ఫోన్‌లను ధ్వంసం చేసినందున వారి వాట్సాప్ చాట్‌లను పంచుకోవాలని మెటాను అభ్యర్థించినట్లు వర్గాలు తెలిపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కుట్రకు సూత్రధారి అయిన లలిత్ ఝా రాజస్థాన్‌లోని నాగౌర్‌లో తన మొబైల్ ఫోన్‌ను పారవేసి, ఇతర నిందితుల ఫోన్‌లను తగలబెట్టాడు. అతను సంఘటన తర్వాత పారిపోయాడు. పోలీసులు తర్వాత ఝాకు చెందిన విరిగిన, కాలిపోయిన మొబైల్ ఫోన్ల శకలాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ భాగాలను ఫోరెన్సిక్ విభాగానికి పంపించి వాటి నుంచి డేటాను పొందవచ్చునేమో అని పరిశీలిస్తున్నారు. పార్లమెంటు భద్రతా ఉల్లంఘన



కేసులో ప్రమేయం ఉన్నందున దిల్లీ పోలీసులు ఇప్పటివరకు సాగర్ శర్మ, మనోరంజన్ డి, అమోల్ షిండే, నీలం దేవి, లలిత్ ఝా, మహేశ్ కుమావత్‌ను అరెస్టు చేశారు. వారిపై కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద కేసు నమోదు చేశారు. సాగర్, మనోరంజన్ డిసెంబరు 13న జీరో అవర్‌లో సందర్శకుల గ్యాలరీ నుంచి లోక్‌సభ ఛాంబర్‌లోకి దూకారు. డబ్బాల నుంచి పసుపు పొగను విడుదల చేశారు. ఎంపీలు వారిని పట్టుకోవడానికి ముందు నినాదాలు చేశారు. అదే సమయంలో అమోల్, నీలం పార్లమెంటు ఆవరణ వెలుపల డబ్బాల నుంచి రంగు పొగను విడుదల చేసి నినాదాలు చేశారు. పార్లమెంటు గేటు బయట ఉన్న లలిత్ ఝా తన మొబైల్ ఫోన్‌లో ఈ ఘటనను రికార్డు చేశాడు. వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి తన స్నేహితులతో పంచుకున్న తర్వాత అతను నాగౌర్‌కు పారిపోయాడు. మహేశ్, మరో నిందితుడు కైలాశ్ బంధుమిత్రులు అక్కడే బస ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతరం లలిత్, మహేశ్ దిల్లీకి వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోయారు. విప్లవకారుడు భగత్ సింగ్ భావజాలంతో తాము ప్రభావితమయ్యామని, తమ చర్య ద్వారా ప్రభుత్వానికి సందేశం పంపాలనుకుంటున్నామని నిందితులు పోలీసులకు చెప్పారు.

తమిళనాడును వదలని వర్షాలు

జనజీవనం అస్తవ్యస్తం

చెన్నై: తమిళనాడును భారీ వర్షాలు ముంచెత్తాయి. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. దాంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ వానలతో దక్షిణ తమిళనాడుకు చెందిన తిరునెల్వేలి, తూత్తుకుడి, తెన్కాసి, కన్యాకుమారి జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆయా జిల్లాల్లో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల కార్యకలాపాలు నిలిచిపోయాయి. విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా పాపనాశం, పెరుంజని, పెచుపారై డ్యాముల నుంచి నీటిని వదలడంతో తిరునెల్వేలి, తూత్తుకుడి, తెన్కాసి జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భారీగా వరద చేరింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునిగాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అవసరమైతే ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను తరలించడానికి సిద్ధంగా ఉండాలని ఆయా జిల్లాల కలెక్టర్లను స్టాలిన్ ఆదేశించారు. ప్రస్తుతం భారీస్థాయిలో ఎన్డీఆర్‌ఎఫ్, పోలీసు బలగాలను మోహరించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు. ఈ నెల ప్రారంభంలో మిగ్‌జాం తుపాను ప్రభావంతో తమిళనాడు ఉక్కిరిబిక్కిరైంది. దాని నుంచి కోలుకుంటున్న సమయంలో మళ్లీ భారీ వర్షాలు తమిళనాడును అతలాకుతలం చేస్తున్నాయి. తూత్తుకుడిలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమానాలను దారి మళ్లించారు. మరికొన్ని సర్వీసులు రద్దు చేశారు. వందేభారత్ సహా 17 రైళ్లు రద్దయ్యాయి.

ప్రజల సహాయంతో దేశాన్ని ముందుకు తీసుకెళతాం: ఖడ్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే సోమవారం ఇక్కడ పార్టీ క్రౌడ్ ఫండింగ్ ప్రచారాన్ని ప్రారంభించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసరాల ధరలకు వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, కోశాధికారి అజయ్ మాకెన్ సమక్షంలో 'దేశం కోసం విరాళం' ప్రచారాన్ని ప్రారంభించిన ఖడ్గే... తన జీతం నుండి రూ.1,38,000 మొత్తాన్ని పార్టీకి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఖడ్గే విలేకరులతో మాట్లాడుతూ... 'దేశాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ సామాన్య ప్రజల సహాయాన్ని కోరడం ఇదే తొలిసారి అని నేను భావిస్తున్నాను. ఇందుకోసం మా పార్టీ నాయకులు యాప్‌ను సిద్ధం చేయడం చాలా సంతోషకరం' అని ఖడ్గే అన్నారు. క్రౌండ్ ఫండింగ్ ప్రచారంలో భాగంగా పార్టీ చిన్న దాతల నుంచి డబ్బును స్వీకరిస్తుందని ఆయన తెలిపారు. ధనవంతుల విరాళాలపై ఆధారపడి పార్టీ పని చేస్తే... రేపు మేము వారి కార్యక్రమాలు, విధానాలకు అంగీకరించాలని ఆయన అన్నారు. పేదలు, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన వర్గాల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ఇప్పటికే పనిచేస్తోందని... ఎప్పటినుంచో వారు కూడా మాకు సహాయం చేస్తున్నారని ఖడ్గే అన్నారు. సాధారణ ప్రజల నుంచి సహాయం తీసుకోవడం ద్వారా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తాము కృషి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ సాధారణ ప్రజల నుంచి సహాయం అందుతుందని... మహాత్మాగాంధీ కూడా దేశ ప్రజల సహకారంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని ఖడ్గే వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తారని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ 138 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎవరైనా రూ.138, 1,380 లేదా 1,38,000 విరాళం ఇవ్వడం ద్వారా పార్టీకి సహకరించవచ్చని మాకెన్ తెలిపారు.

ఓబ్రెయిన్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

రాజ్యసభ ఛైర్మన్‌కు ఖడ్గే లేఖ

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్‌పై సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గే సోమవారం ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌కు లేఖ రాశారు. పార్లమెంటులో శాంతి భద్రతల ఉల్లంఘన అంశంపై హోం మంత్రి ప్రకటన చేయాలని మాత్రమే టీఎంసీ నేత డిమాండ్ చేస్తున్నారని ఆయన తెలిపారు. 'డిసెంబరు 13న లోక్‌సభలో జరిగిన దిగ్భ్రాంతికరమైన సంఘటనపై హోం వ్యవహారాల మంత్రి ఒక ప్రకటన కోసం 'ఇండియా కూటమి' పార్టీల సమష్టి డిమాండ్‌ను లేవనెత్తడానికి అతను (ఓబ్రెయిన్) మీ దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. హోం మంత్రి ఈ అంశంపై మాట్లాడకపోవడం 'పార్లమెంటరీ సంప్రదాయాలను ఉల్లంఘించడమే' అని తెలిపారు. 'ఇవి పూర్తిగా న్యాయబద్ధమైన డిమాండ్లు. డిసెంబరు 13 నాటి సంఘటనల గురించి హోం వ్యవహారాల మంత్రి మీడియా కార్యక్రమంలో మాట్లాడవచ్చు. కానీ పార్లమెంటులో ప్రకటన రూపంలో ఏమీ చెప్పడానికి నిరాకరించడం పార్లమెంటరీ సంప్రదాయాలను ఉల్లంఘించడమే' అని పేర్కొన్నారు, డిసెంబరు 14న ఓబ్రెయిన్ రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే పార్లమెంటు భద్రతా ఉల్లంఘన సంఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు 13 మంది ఎంపీలు లోక్‌సభ నుంచి మిగిలిన సమావేశాలకు సస్పెండ్ అయ్యారు. కాగా 13 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి ఆదివారం స్పీకర్‌ను కోరారు. అయితే, డిసెంబరు 13 సంఘటనతో ఎంపీల సస్పెన్షన్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పీకర్ ఓం బిర్లా అన్నారు.

సెక్యూరిటీ పోస్ట్ భర్తీ చేద్దాం

పేర్లు ప్రతిపాదించాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో భద్రతా ఉల్లంఘనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర ప్రభుత్వం... కొత్త పార్లమెంటు భవనం సెక్యూరిటీ ఇన్‌చార్జి నియామకానికి సిద్ధమైంది. జాయింట్ సెక్రటరీ (సెక్యూరిటీ) పోస్ట్ కోసం సీనియర్ సివిల్ సర్వెంట్ల పేర్లు ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలకు (కేంద్రపాలిత ప్రాంతాలు, గోవా, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్ మినహా) 10 లైన్ల లేఖ రాసింది. అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న ఐపీఎస్ అధికార్ల నామినేషన్లు పంపాలని ఆ లేఖలో రాష్ట్రాలను కోరింది.జాయింట్ సెక్రటరీ (సెక్యూరిటీ) పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉంది. చివరిసారిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన 1997 బ్యాచ్ అధికారి రఘుబీర్ లాల్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఆయన గత నవంబర్ మొదట్లో తన సొంత రాష్ట్రానికి బదిలీ అయ్యారు. ఈనెల 13న పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో గ్యాలరీ నుంచి సాగర్ శర్మ అనే వ్యక్తి లోక్‌సభలోకి దూకి నానా హంగామా చేయడం, ఇదే సమయంలో విజిటర్స్ గ్యాలరీలో ఉన్న డి.మనోరంజన్ అనే వ్యక్తి గ్యాస్ డబ్బాలు విసరడం సంచలనమైంది. ఇదే సమయంలో పార్లమెంటు వెలుపల పొగ డబ్బాలతో నిరసనకు దిగిన నీలందేవి, అమోల్ షిండేలను భద్రతా సిబ్బంది, పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు ఈ దాడికి ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న లలిత్ ఝాను సైతం అదుపులోకి తీసుకున్నారు. నిందితులందరినీ ఏడు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు ఆదేశించింది.

27 నుంచి నీతి ఆయోగ్ సమావేశాలు

న్యూఢిల్లీ: ఈ నెల 27వ తేదీ నుంచి నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి సమావేశాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో నీతి ఆయోగ్ సమావేశాలు నిర్వహించనుంది. ప్రధానంగా రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, అమలు తీరుతెన్నులపై చర్చించనున్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు దిల్లీ పూసా ఇనిస్టిట్యూట్‌లో సమావేశాలు జరుగుతాయి. ఇది నీతి ఆయోగ్ అధ్వర్యంలో 3వసారి జరుగుతున్న ప్రధాన కార్యదర్శుల సమావేశం. అన్ని రాష్ట్రాల సీఎస్‌లు తప్పని సరిగా హాజరు కావాలని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా లేఖలు పంపారు. సమావేశాలకు ముందు అన్ని రాష్ట్రాలు నీతి ఆయోగ్ కోరిన అంశాలపై నివేదికలు పంపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, అమలు తీరుతెన్నులపై సీఎస్‌లను నీతి ఆయోగ్ నివేదికలు కోరింది. కనీసం వారం రోజుల ముందుగా అయినా నివేదికలు పంపాలని నీతి ఆయోగ్ సూచించింది.

సినీనటి జయప్రదకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: సినీనటి జయప్రదకు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. చెన్నైలోని జయప్రద సినిమా థియేటర్‌కు సంబంధించిన ఈఎస్ఐ కేసులో కింద స్థాయి కోర్టు విధించిన 6 నెలల జైలుశిక్షపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీంతో ఆమెకు ఉపశమనం లభించింది. జయప్రద దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జయప్రద పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసేంతవరకూ జైలు శిక్షపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. చెన్నైలోని జయప్రద సినిమా థియేటర్‌కు సంబంధించి ఈఎస్ఐ కేసులో చెన్నై విచారణ కోర్టు ఆమెకు 6 నెలల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును ఆమె హైకోర్టులో సవాలు చేసింది. అయితే విచారణ కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. స్టే విధించడానికి నిరాకరించింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టులో జయప్రద సవాలు చేశారు.

ఏ మొబైల్ నెట్‌వర్క్ అయినా కేంద్రం స్వాధీనం

లోక్‌సభకు ముసాయిదా బిల్లు

న్యూఢిల్లీ: టెలికమ్యూనికేషన్స్ ప్రతిపాదిత చట్టం ప్రకారం ప్రజా భద్రత లేదా పబ్లిక్ ఎమర్జెన్సీ సందర్భాల్లో ఏదైనా టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను కేంద్రం తాత్కాలికంగా స్వాధీనం చేసుకునేలా మోదీ సర్కారు ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. గతవారం పార్లమెంట్ భద్రత ఉల్లంఘనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో టెలికమ్యూనికేషన్స్ బిల్లు 2023ను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 'విపత్తు నిర్వహణతో పాటు ఏదైనా పబ్లిక్ ఎమర్జెన్సీ సంభవించినప్పుడు లేదా ప్రజల భద్రత దృష్ట్యా... కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం, అలాగే కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాల తరపున ప్రత్యేకంగా అధికారం పొందిన ఏదైనా అధికారి...అధీకృత సంస్థ నుంచి ఏదైనా టెలికమ్యూనికేషన్ సర్వీస్ లేదా నెట్‌వర్క్‌ని తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవచ్చని ముసాయిదా చట్టం (డ్రాఫ్ట్ లా) స్పష్టం చేసింది. అంతేకాకుండా (జాతీయ భద్రతా నిబంధన ప్రకారం నిషేధిస్తే తప్ప) అక్రిడిటేషన్ ఉన్న మీడియా వ్యక్తుల నుండి వచ్చే సందేశాలను కూడా అడ్డగించరాదని బిల్లు పేర్కొంది. భారతదేశంలో ప్రచురించడానికి ఉద్దేశించిన పత్రికా సందేశాలు... కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన కరస్పాండెంట్‌లు ప్రసారం చేయడాన్ని నిషేధిస్తే తప్ప... వాటిని అడ్డుకోవడం లేదా నిర్బంధించడం జరగదని ముసాయిదా బిల్లు పేర్కొంది. ప్రజల భద్రత దృష్ట్యా వ్యక్తుల మధ్య ఏదైనా సందేశాన్ని నిరోధించడాన్ని ప్రభుత్వం నిర్దేశించవచ్చని ఈ చట్టం వెల్లడించింది. ఇది టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిలిపివేయడానికి ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. ఒకవేళ మెసేజ్‌లను చట్టవిరుద్ధంగా అడ్డగిస్తే... మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రెండు శిక్షలూ విధించవచ్చని బిల్లు చెబుతోంది. ఈ కొత్త ముసాయిదా చట్టం... ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 1885, ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రాఫీ చట్టం 1933, టెలిగ్రాఫ్ వైర్స్ (చట్టవిరుద్ధమైన స్వాధీనం) చట్టం 1950 స్థానంలో వస్తుంది. ఆ చట్టాలు 138 ఏళ్ల నాటి పాతవి కావడం, సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో... కొత్త చట్టం అవసరమని కేంద్రప్రభుత్వం వాదిస్తోంది.

పట్టాలెక్కిన మరో వందే భారత్ రైలు

వారణాసి: ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరపదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం వారణాసిలో సోమవారం కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వారణాసి నుంచి దిల్లీకి మరో కొత్త వందేభారత్ రైలును ప్రధాని ప్రారంభించారు. అధునాతన ఫీచర్లతో తీర్చిదిద్దిన ఈ రైలుకు పచ్చజెండా ఊపారు. అనేక గూడ్స్ రైళ్లను సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యతో పాటు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. వారణాసి- దిల్లీ మార్గంలో ఇప్పటికే ఒక వందేభాతర్ రైలు నడుస్తుండగా... ఇది రెండోది. ఈ రైలులో వైఫై సేవలతో పాటు ప్రయాణికులకు అన్ని అధునాతన సదుపాయాలు కల్పించారు. ఇంటీరియర్స్, టచ్-ఫ్రీ సౌకర్యాలతో కూడిన బయో-వాక్యూమ్ టాయిలెట్లు, ప్రతి సీటు వద్ద ఛార్జింగ్ పాయింట్లు, టచ్ బేస్డ్ రీడింగ్ లైట్లు వంటి సదుపాయాలు ఈ రైలులో ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఈ వందే భారత్ సెమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య సేవలందిస్తున్నాయి. తాజా రైలుతో మొత్తం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ల సంఖ్య 35కి చేరింది.

కోర్టుకు ఆర్కియాలజీ సర్వే నివేదిక

వారణాసి: జ్ఞానవాపి మసీదుపై శాస్త్రీయ సర్వే నివేదికను భారత పురావస్తు శాఖ సోమవారం వారణాసి జిల్లా కోర్టుకు సమర్పించింది. సీల్డ్ కవర్‌లో ఈ నివేదికను ఆర్కియాలజికల్ సర్వే స్టాండింగ్ కౌన్సిల్ అమిత్ శ్రీవాత్సవ అందజేశారు. వారణాసి జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్ సర్వే నివేదికను సమర్పించేందుకు కోర్టు ఏఎస్ఐకి వారం రోజుల పాటు ఇంతకుముందు గడువు పొడిగించింది. కోర్టుకు సర్వే నివేదిక అందజేసినట్టు హిందూవర్గం తరపు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ మీడియాకు చెప్పారు. సుప్రసిద్ధ కాశీ విశ్వనాథ్ ఆలయానికి ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదును 17వ శతాబ్దంలో నిర్మించడానికి ముందు అక్కడ హిందూ ఆలయం ఉండేదా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఏఎస్ఐ శాస్త్రీయ సర్వే నిర్వహించింది. ఈ సర్వేకు వారణాసి జిల్లా కోర్టు అనుమతించడం, జిల్లా కోర్టు తీర్పును అలహాబాద్ హైకోర్టు సమర్థించడంతో హైకోర్టు తీర్పును జ్ఞానవాపి కమిటీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. సుప్రీంకోర్టు సైతం హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో శాస్త్రీయ సర్వే ప్రారంభానికి ఆటంకాలు తొలగిపోయాయి.

కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ

- రాజస్థాన్, ఎంపీ, చత్తీస్‌గఢ్ ఫలితాలు గుణపాఠం కావాలి
- పార్లమెంటు ఎన్నికల్లో 'ఇండియా' పక్షాలను కలుపుకుపోవాలి
- ఐక్యతవల్లే తెలంగాణలో గెలుపు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐతో పాటు అందరినీ కలుపుకుని పోవడం వల్లే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ అధిష్ఠానం ఓ గుణపాఠంగా తీసుకుని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సైతం అన్ని పార్టీలను కలుపుకెళ్లాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డితో కలిసి హైదరాబాద్ మగ్దూం భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ ... లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కో స్థానంలో సీపీఐ పోటీ చేయబోతోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడల కారణంగానే రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ఓటమి పాలైందని... దేశానికి ప్రమాదకారియైన బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ తప్పిదాలే బీజేపీని గెలిపించాయని నారాయణ స్పష్టం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలను కలుపుకుపోవడం కాంగ్రెస్‌కు అత్యంత ముఖ్యమని తెలిపారు. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో ఏడు నియోజకవర్గాల్లో బలంగా ఉన్న సీపీఐకి కాంగ్రెస్ ఒక్క స్థానం కూడా ఇవ్వలేదన్నారు. తమకు ఒక్క సీటు ఇచ్చినా బస్తర్ కాంగ్రెస్‌కు సానుకూలంగా మారేదన్నారు. వామపక్షాన్ని అణచివేయాలనే ఉద్దేశంతోనే సీపీఐకి జాతీయ గుర్తింపును తొలగించారని దుయ్యబట్టారు. రెండు రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలలో మండలస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీకి కార్యాలయాలు, పూర్తి స్థాయి కార్యకర్తలు (హోల్ టైమర్లు) ఉన్నారని, వీటన్నింటిని దృష్టిలో పెట్టుకోకుండా సాంకేతిక కారణాల పేరుతో తమ పార్టీ జాతీయ గుర్తింపును తొలగించారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం రెండు, మూడు రాష్ట్రాలు మినహా దేశంలో ఎక్కడా లేదని, అయినా ఆ పార్టీకి జాతీయ గుర్తింపు ఇచ్చారన్నారు. వామపక్ష తీవ్రవాదం పేరుతో సాంకేతిక కారణాలను చూపుతూ సీపీఐని దెబ్బకొట్టారన్నారు. బస్తర్‌లో తమకు పార్టీ గుర్తింపు కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖరాసినా స్పందించలేదని, కనీసం తాము కుండ గుర్తు అడిగితే... గిరిజన ప్రాంతాల్లో ఎవరికీ తెలియని ఏసీ గుర్తు ఇచ్చారని మండిపడ్డారు. అయినా కేవలం మూడువేల ఓట్ల తేడాతోనే తాము ఓడిపోయామని వివరించారు. ఎన్నికల అవగాహనలో భాగంగా రాజస్థాన్‌లో సీపీఎంకు ఉన్న రెండు సిట్టింగ్ సీట్లు, సీపీఐ రెండు సీట్లు అడిగినా ఇవ్వలేదని... సీపీఐ, సీపీఎంను కలుపుకుంటే అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదని వివరించారు. తెలంగాణలో అందరినీ కలుపుకుని పోవడంతో గెలిచారని గుర్తుచేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ పోటీ

రాబోయే లోక్ ఎన్నికలలో కేరళలో నాలుగు, తమిళనాడులో రెండు, పశ్చిమ బెంగల్‌లో మూడు, చత్తీస్‌గఢ్‌లో బస్తర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక్కో లోక్ సభ స్థానంలో సీపీఐ పోటీ చేయనున్నట్లు నారాయణ వెల్లడించారు. ఎన్నికల అవగాహనలో భాగంగా మధ్యప్రదేశ్‌లో ఒక్క స్థానంలో సీపీఐకి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మద్దతునిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల తో అవగాహన కుదిరితే సరేనని... లేదంటే కలిసొచ్చే వామపక్ష, లౌకిక శక్తులతో కలిసి పోటీ చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. ఇటీవల ఎన్నికల్లో జరిగిన పరిణామాలను ఇండియా కూటమి సమావేశంలో ప్రస్తావనకు తీసుకురావాలని తాము సీపీఐ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

కేంద్ర హోంమంత్రిపై 'ఉపా' కేసు పెట్టండి

పార్లమెంట్‌లో చోటుచేసుకున్న ఘటన భద్రతా వైఫల్యానికి నిదర్శనమని నారాయణ అన్నారు. దీనికి బాధ్యుడిని చేస్తూ కేంద్ర హోంమంత్రి పై 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీకి చెందిన ఎంపీ పాస్ ద్వారానే ఆగంతకులు పార్లమెంటులో చొరబడ్డారన్నారు. ఒక వేళ వారు తమ పార్టీ లేదా, ముస్లిం ఎంపీ పాస్ వచ్చి ఉంటే దేశంలో పరిస్థితులు దారుణంగా ఉండేవని నారాయణ వ్యాఖ్యానించారు. ఏపీలో కూడా అధికార మార్పిడి ఖాయమని చెప్పారు. ధరణి పేరుతో మాజీ సీఎం కేసీఆర్ చేసిన మోసం కంటే ఆంధ్రా సీఎం జగన్ ఎక్కువ తప్పులు చేస్తున్నారని విమర్శించారు. తెలుగు ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఉంటే, ఆయన మాత్రం బీజేపీకి అనకూలంగా ఉన్నారన్నారు.

ఇక రిటైర్డ్ అధికారులొద్దు...

నిపుణులు, మంచి అనుభవం ఉందనే పేరుతో రిటైర్డ్ అధికారులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నారాయణ సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తాము స్వాగతిస్తున్నామని, అదే సమయంలో నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి... ఇబ్బందిపడుతున్న ఆటో వాలలకు న్యాయం చేయాలని కోరారు. పర్యాటక శాఖ కార్యాలయంలో ఉద్దేశపూర్వకంగా దస్త్రాలను తగులబెట్టారని, ఈ ఘటనపైన వెంటనే విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒకేలా ఉండవు: అజీజ్ పాషా

సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ శాసనసభ, లోక్ ఎన్నికల ఫలితాలు ఒకేలా ఉండబోవని... గతంలో జరిగిన ఎన్నికలు పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. ఇటీవల రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఎంపీ ఎన్నికల ఫలితాల ఆధారంగా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని కొన్ని జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేయడాన్ని తప్పుబట్టారు. గతంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, ఆ వెంటనే జరిగిన లోక్ ఎన్నికలకు తేడా కనిపించిందని గుర్తు చేశారు.

'భూ సమస్యల'పై అఖిపక్షం: చాడ వెంకట్ రెడ్డి

చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జటిలమైన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ నిపుణులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌ను కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి నందున... ఆదాయాన్ని కోల్పోయి ఇబ్బంది పడుతున్న ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు వారితో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఆహంభావ వ్యవహార శైలితోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని, ఇప్పటికైనా ఆ పార్టీ నిర్మాణాత్మక పాత్రను పోషించాలని హితవు పలికారు. అందరూ కలిసి ఐక్యంగా వెళ్తే మంచి ఫలితాలు వస్తాయని ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలే నిరూపించాయని ఏఐసీసీ నేతలకు ఆయన సూచించారు.

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-బ్యూరో కర్నూలు: మహిళలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని, అంగన్‌వాడీలతో పెట్టుకున్న ఈ ప్రభుత్వానికి మనుగడ కష్టమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చౌక్ వద్ద చేపట్టిన 7వ రోజు ఆందోళనకు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. లక్ష మంది అంగన్‌వాడీలు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణా ప్రభుత్వం కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రభుత్వం అంగన్‌వాడీలు అడుగున్న న్యాయమైన కోరికలను పరిష్కరించాలని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో వారు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పోలీసులను పంపించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి వాటిని స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమన్నారు. తాళాలు పగులగొడితే రాబోయే ఎన్నికలలో అంగన్‌వాడీలు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తారన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియ జేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఐద్వా నాయకురాలు నిర్మలమ్మ, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నాయకులు రామాంజి, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఢిల్లీ లిక్కర్ కేసులో పిళ్లైకి బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక నిందితుడు అరుణ్ రామచంద్రన్ పిళ్లైకి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగ్‌పాల్ మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. భార్య అనారోగ్య కారణంగా పిళ్లైకి మధ్యంతర బెయిల్ లభించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బినామీగా అరుణ్ రామచంద్రన్ పిళ్లైపై దర్యాప్తు సంస్థలు అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. పిళ్లై అప్రూవర్‌గా మారతారన్న ప్రచారాన్ని పిళ్లై తరపు న్యాయవాది ఖండించారు. గతంలోనే అప్రూవర్‌గా శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ మారిన విషయం తెలిసిందే. ఆరు నెలల్లోపు కేసు దర్యాప్తు పూర్తి చేస్తామని ఇప్పటికే సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది. త్వరలోనే మరో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ఈడీ ప్రయత్నాలు చేస్తోంది. మళ్లీ తెరపైకి ఢిల్లీ లిక్కర్ కేసు రానున్నది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో తిరిగి దర్యాప్తులో వేగం పెంచే యోచనలో దర్యాప్తు సంస్థలు ఉన్నట్లు సమాచారం. మరోసారి ఈ కేసులో లింకు ఉన్న కొంతమందిని ప్రశ్నించేందుకు నోటీసులు జారీ చేసే యోచనలో ఈడీ వర్గాలు ఉన్నాయి.

మోదీపై పోటీ చేసే దమ్ముందా?

కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్

పాట్నా: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించే సత్తా ఇండియా కూటమికి ఉందా అని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ సవాల్ విసిరారు. ధైర్యం ఉంటే ప్రధాని నరేంద్రమోదీపై ఇండియా కూటమిలోని ఏ నాయకుడైనా పోటీ చేయవచ్చని అన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా ధైర్యం ఉంటే బనారస్‌లో మోదీపై ఎన్నికల్లో పోటీ చేయండి. నితీశ్‌కుమార్‌కి, ఇండియా కూటమికి సవాల్ చేస్తున్నా...పోటీ చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులు తమ సొంత ప్రయోజనాల కోసం, తమ నేరాలు దాచుకోవడం కోసమే కూటమిగా ఏర్పడినట్లు ఎదురుదాడికి దిగారు. కేంద్రమంత్రి గిరిరాజ్ తరచూ వివాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇటీవల ఆయన హలాల్, ఝట్కా మాంసాలపై నోరుపారేసుకున్నారు. సనాతన ధర్మంలో బలి ఇచ్చే సంప్రదాయం ఉందని, ఈ బలి అనేది ఒక్క వేటుతోనే చేయబడుతుందన్నారు. అందుకే హిందువులు మాంసాహారం తింటే, ఝట్కా మాంసాన్నే తినాలన్నారు. హలాల్ మాంసం తినడం మానేయండని, హలాల్ మాంసాన్ని తింటూ తమ మతాన్ని భ్రష్టు పట్టించబోమని హిందువులు ఇప్పటినుంచే ప్రతిజ్ఞ చేయాలని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముస్లింలు ఎలాగైతే తమ మతానికి కట్టుబడి ఉన్నారో, హిందువులు కూడా అలాగే ఉండాలని పిలుపునిచ్చారు. ముస్లింలు తమ మతానికి కట్టుబడి ఉన్నందున...వారిని తాను గౌరవిస్తానని, ఈ విషయాన్ని హిందువులు కూడా అర్థం చేసుకోవాలన్నారు.

భారీ పేలుళ్ల కుట్ర భగ్నం

- 8 మంది అనుమానిత ఐసిస్ ఏజెంట్ల అరెస్టు
- ఎన్ఐఏ వెల్లడి... నాలుగు రాష్ట్రాల్లో తనిఖీలు

న్యూఢిల్లీ: దేశంలో భారీ పేలుళ్లకు జరిగిన కుట్రను భగ్నం చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వెల్లడించింది. ఈ వ్యవహారంలో ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధం ఉన్న మొత్తం ఎనిమిది మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు తెలిపింది. వీరు కర్నాటకలోని ఐసిస్ బళ్లారి మాడ్యుల్‌కు చెందినవారని, వారి వద్ద నుంచి పేలుడు పదార్థాల నిల్వలు, మారణాయుధాలు, నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. వీరంతా పేలుళ్లకు కుట్ర పన్నారని, ఈ క్రమంలోనే దాడుల ప్రణాళికతో కూడిన పత్రాలూ లభ్యమైనట్లు తెలిపింది. నిషేధిత ఇస్లామ్ స్టేట్ (ఐఎస్ఐఎస్) నెట్‌వర్క్ కేసులో నాలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ ఆకస్మిక దాడులు చేస్తోంది. అందులో భాగంగా సోమవారం కర్నాటక, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీలోని 19 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఉగ్రవాద నెట్‌వర్క్‌లోని అనుమానితుల ఇళ్లల్లో ఎన్ఐఏ అధికారులు తనిఖీచేశారు. ఒక్క కర్నాటకలోనే 11 ప్రాంతాల్లో దాడులు చేయగా, జార్ఖండ్‌లో నాలుగు, మహారాష్ట్రలో మూడు, ఢిల్లీలో ఒక ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. కర్నాటకలోని బళ్లారిలో ఐసిస్ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న ఎనిమిది మంది ఉగ్రవాదులను అరెస్టు చేశామని... దీంతో ఐఈడీ పేలుళ్లను ప్రేరేపించే ప్రణాళికలు విఫలమయ్యాయని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. సల్ఫర్, పొటాషియం నైట్రేట్, గన్‌పౌడర్ వంటి పేలుడు పదార్థాల నిల్వలు, అలాగే ఆయుధాలు, ప్రతిపాదిత దాడుల వివరాలతో కూడిన పత్రాలు, బాకులు వంటి పదునైన ఆయుధాలతో పాటు నగదు, డిజిటల్ పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. బళ్లారి మాడ్యూల్‌పై గత వారమే 'ఎన్ఐఏ' కేసు నమోదు చేసింది. అప్పటి నుంచి రాష్ట్ర పోలీసులు, ఇతర కేంద్ర సంస్థలతో కలిసి నిందితుల కోసం వేట సాగిస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. బళ్లారి మాడ్యూల్ లీడర్ మినాజ్ అలియాస్ మహ్మద్ సులేమాన్‌నూ అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు ఒకరితో ఒకరు సంప్రదింపులు జరపడానికి ఇన్‌స్టాంట్ మెసేజింగ్ యాప్‌లను ఉపయోగించారని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. పేలుడు పదార్థాలను ఉపయోగించి ఐఈడీలు, ఇతర పేలుడు పరికరాలను రూపొందించడానికి ప్లాన్ చేశారని చెప్పారు. కళాశాల విద్యార్థులను ఉగ్ర కార్యకలాపాల దిశగా ఆకర్షించేందుకు కూడా ప్రయత్నాలు చేసినట్లు వెల్లడించారు. కాగా గతవారం మహారాష్ట్రలోని 40 ప్రదేశాల్లో నిర్వహించిన తనిఖీలలో 15 మందిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. వారిలో ఒకరిపై ఐసిస్ మ్యాడ్యూల్‌కు కొత్తగా రిక్రూట్‌మెంట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా అతనివద్ద పెద్దమొత్తంలో నగదు, ఆయుధాలు, పదునైన వస్తువులు, రహస్య పత్రాలతోపాటు అనేక డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారంతా విదేశీయుల ఆదేశాలతో దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

అండగా ఉంటాం

ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్, పీసు రేటు కార్మికుల సమావేశంలో ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణపై ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మండిపడ్డారు. ఉద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్, పీసు రేటు కార్మికుల ఆత్మీయ సమావేశం సోమవారం స్థానిక కందుకూరి కల్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశానికి పి. శ్రీనివాసరావు అధ్యక్షత వహిం చారు. ఓబులేసుతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 20 ఏళ్లుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, పీసు రేటు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను క్రమబద్ధీక రించాలని ఓబులేసు డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంగా ఆ కార్మికులకు జగన్ ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. బాలకాశి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల కారణంగా ఉద్యోగాలు కోల్పోతున్న మీటర్ రీడర్లను... వారి అర్హత ఆధారంగా సబ్ స్టేషన్లలో ఆపరేటర్లుగాను, ఆఫీస్ సబార్డినేటులు నియమించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్తు పోరాటాలకు అండగా ఉంటామని, రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యను తక్షణ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.శివయ్య, ఏసోబు, రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు రామలింగారెడ్డి, ఎనర్జీ అసిస్టెంట్ సెక్రటరీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, నాయకులు శ్రీనివాసు, శివారెడ్డి, రమేష్, రమాదేవి, జిలాని, రాజు, పాపారావు, గఫార్ తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల నుండి భారీ సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

మోదీని 'ఇండియా' తరిమికొడుతుంది

ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్

పాట్నా : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి తిరిగి వస్తారన్న బీజేపీ వాదనపై ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ సోమవారం విరుచుకుపడ్డారు. 'ఇండియా కూటమి' మోదీని అధికారం నుంచి తరిమికొడుతుందని నొక్కి చెప్పారు. మంగళవారం ఢిల్లీలో జరగనున్న కూటమి సంకీర్ణ సమావేశానికి తన కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌తో కలిసి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడ విలేకరులతో మాట్లాడారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కూటమి భాగస్వామ్య పక్షాలు అన్ని కలిసి కూర్చొని వ్యూహాన్ని రచించే సమావేశం కోసం తాను ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. 'మోదీ తిరిగి (అధికారంలోకి) వస్తాడని చెప్పడానికి మీకు ఒక్కటి మాత్రమే ఉన్నట్లు కనిపిస్తోంది. అలా అయితే, అలాగే ఉండండి... దయచేసి మోదీ గురించి పెద్దగా గొడవ చేయకండి. 'ఇండియా కూటమి' ఆయనను అధికారం నుంచి తరిమికొడుతుంది' అని లాలూ అన్నారు. ఇదిలాఉండగా, లాలూ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి స్పందిస్తూ, 'లాలూజీ తమాషా చేస్తున్నట్టున్నారు. ఎన్నికల ఓటమిని ఆయన ఎన్నిసార్లు చవిచూశారో లెక్క తప్పదు. బీహార్‌లో నేరస్తులను ఆదరించడంతో పాటు అవినీతికి పాల్పడ్డారు. దాని ఫలితంగా దాణా కుంభకోణం కేసుల్లో ఆయనకు శిక్ష పడింది' అని పేర్కొన్నారు. ఆర్‌జేడీ ప్రస్తుతం బీహార్‌లో అధికారాన్ని అనుభవిస్తున్నది చట్టబద్ధమైన మార్గాల ద్వారా కాదని అన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో మా మిత్రపక్షంగా పోటీ చేసిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రజల తీర్పునకు ద్రోహం చేశారని అన్నారు. జేడీ(యూ), ఆర్‌జేడీలను రెండింటినీ బీహార్ ప్రజలు శిక్షిస్తారని చౌదరి తెలిపారు.

హైదరాబాద్‌కు రాష్ట్రపతి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం సోమవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, అధికారులు స్వాగతం పలికారు. ఆమె అక్కడి నుండి నేరుగా బొల్లారం రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు.

నేడు 'ఇండియా కూటమి' భేటీ

న్యూఢిల్లీ: ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) నాల్గవ సమావేశాన్ని డిసెంబరు 19వ తేదీ మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించనుంది. డిసెంబరు 31 వరకు గడువుతో కీలక రాష్ట్రాలలో సీట్ల కేటాయింపు, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సమష్టి వ్యూహాన్ని పునః పరిశీలించడమే ప్రాథమిక అజెండాగా ఉంటుందని అంచనా. రాబోయే 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించే సవాలుతో వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు పోరాటం చేస్తున్నారు. త్వరితగతిన సీటు-భాగస్వామ్య ఒప్పందాల ద్వారా ఉమ్మడి ప్రచార వ్యూహాన్ని రూపొందించడం, ఓటర్లకు ఒక సాధారణ కార్యక్రమాన్ని అందించడంపై దృష్టి పెట్టడంలో సహాయపడుతుందని కూటమిలో కొన్ని పార్టీలు భావిస్తున్నట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. కాగా, కూటమికి కన్వీనర్, ప్రతినిధి నియామకం, భాగస్వామ్య సచివాలయం ఏర్పాటుపై ఏకాభిప్రాయాన్ని రూపొందించే తక్షణ కర్తవ్యాన్ని 'ఇండియా కూటమి' ఎదుర్కొంటోంది. కూటమి మొదటి సమావేశం జూన్ 23న పాట్నాలో జరిగింది. ఆ తర్వాత జులై 17-18 తేదీల్లో బెంగళూరులో, ఆగస్టు 31, సెప్టెంబరు 1 మధ్య ముంబైలో సమావేశాలు జరిగాయి.

పీఎంవో అధికారిగా నటించి.. ఏడుగురు మహిళలను పెళ్లాడిన వ్యక్తి అరెస్టు

భువనేశ్వర్: భువనేశ్వర్: ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) అధికారి, ఆర్మీ వైద్యుడిగా నటించిన వ్యక్తి పలువురిని మోసగించడం తోపాటు ఏడుగురు మహిళలను పెళ్లాడాడు. పాకిస్థాన్‌లోని వ్యక్తులు, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న అతడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాకు చెందిన 37 ఏళ్ల సయ్యద్ ఇషాన్ బుఖారీ అలియాస్ ఇషాన్ బుఖారీ అలియాస్ డాక్టర్ ఇషాన్ బుఖారీ, పీఎంవో అధికారి, ఆర్మీ వైద్యుడిగా నమ్మించి పలువురిని మోసగించాడు. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ, కెనడియన్ హెల్త్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన మెడికల్ డిగ్రీ సర్టిఫికేట్లతో సహా అనేక నకిలీ పత్రాలను సృష్టించాడు. జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు ఏడుగురు మహిళలను పెళ్లి చేసుకున్నాడు. కాగా, అనేక మంది మహిళలతో వివాహేతర సంబంధాలున్న సయ్యద్ ఇషాన్ బుఖారీ ఒడిశాలో ఉన్నట్లు ఆ రాష్ట్ర స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో జాజ్‌పూర్ జిల్లాలో అతడ్ని అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న విదేశీ నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు, అఫిడవిట్లు, బాండ్లు, పలు ఏటీఎం కార్డులు, ఖాళీ చెక్కులు, ఆధార్ కార్డులు, విజిటింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో అతడికి సంబంధాలున్నాయా అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. పంజాబ్, జమ్ముకశ్మీర్, ఒడిశా పోలీసులతో కూడిన జాయింట్ టీమ్ నిందితుడి కార్యకలాపాల గురించి పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.